
గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్

# వెలుగు రేఖల
# వేటగాడు



ప్రపంచాన్ని జయించే కొత్త అవకాశాల కోసం
కొత్త ఆలోచనలు, కొత్త మార్గాలతో ఒక భారతీయుడు
ఎలా కృషిచేశాడో వివరించే ఇన్‌స్పిరేషనల్ పుస్తకం

సురేశ్ వెలుగూరి



# వెలుగు రేఖల వేటగాడు

## గూగుల్ సారథి సుందర పిచాయ్

జీవన ప్రయాణం నుంచి కొన్ని స్ఫూర్తిదాయక కథనాలు

సురేశ్ వెలుగూరి

ఉదయం వేదిక ప్రచురణ

INSPIRATIONAL Series -1

**VELUGU REKHALA VETAGADU**

A Short book on Sundar Pichai's inspirational life

By Suresh Veluguri

© Author / VMRG INTERNATIONAL

Published for : Udayam Vedika, Hyderabad

First Edition: Jan 2018 | 1000 Copies

Book & Cover design by Author

Fonts : Chitrika © VMRG & Mandali Opensource

Image Resourcing: Setupati RS, Setu Images

Printed at Sai Likhita Printers, Hyderabad

Available at all major book stores &
Buy Online: www.vmrgbooks.com

Every effort has been made to ensure the accuracy of the contents and associated material. The publishers, authors and contributors accept no liability for any loss sustained as a result of using the information in this book.

All rights reserved. This book or any portion thereof may not be reproduced or used in any manner whatsoever without the express written permission of the publisher except for the use of brief quotations in a book review.

Price: ₹60

**Sole Distributors**
VMRG INTERNATIONAL
www.vmrgbooks.com
6-3-596/79/4, Naveen Nagar, Hyderabad - 500004.
Phone: 040 65572593, 9290583333 | vmrgbooks@gmail.com

# సుందర శోధనం

ఈ పుస్తకానికి **'వెలుగురేఖల వేటగాడు'** అని పేరు పెట్టడానికి ముందు కొంత సంశయించాం. కానీ, ఆలోచించిన మీదట ఇదే సరైన టైటిల్ అనిపించింది. సుందర పిచాయ్ ఈరోజు గూగుల్ కీలక రథసారథుల్లో ఒకడు కావచ్చు; కానీ, అంతకు ముందే అతను మన భారతీయుడు. భారతీయ జీవన వ్యవస్థలో పుట్టిపెరిగినవాడు; ఇక్కడి సదుపాయాలకు అనుగుణంగా చదువుకున్నవాడు, తన నైపుణ్యాల్ని పెంచు కున్నవాడు. ఔత్సాహికులకు ఉత్తేజాన్నిచ్చినవాడు. నిరంతరం సరికొత్త అవకాశాల కోసం శోధిస్తున్న అవకాశాల వేటగాడు. ప్రపంచాన్ని మరింత ముందుకు తీసుకెళ్ల డానికి అవసరమైన నవ్య సాంకేతికావిష్కరణలకు తన నైపుణ్యాల్ని వెచ్చిస్తున్నవాడు. శోధన ఆధారంగా ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగాన్ని శాసిస్తున్న గూగుల్‌కి సీఈఓ స్థాయికి ఎదిగినవాడు.

సుందర్ పిచాయ్‌ది చాలా సాదాసీదా జీవితం. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా, తనను తాను బలంగా నిలబెట్టుకున్న నిత్యశ్రామికుడు. ఔత్సాహిక తెలుగు మిత్రులకు కాస్త స్ఫూర్తిని, ఉత్తేజాన్ని అందించాలన్న సంకల్పంతో సుందర్ జీవితాన్ని క్లుప్తంగా ఇలా పుస్తక రూపంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశాం.

'ఉదయం వేదిక' ఒక స్వచ్ఛంద బుక్‌ట్రస్టుగా ఇటువంటి విలువైన పుస్తకాలను తక్కువ ధరలో, నాణ్యమైన ముద్రణలో అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తోంది. ఈ పుస్తకంలో స్వేచ్ఛగా ఉపయోగించుకున్న ఫొటోలు, చిత్రాల యజమానులు, కాపీరైట్ హక్కుదార్లకు 'ఉదయం' కృతజ్ఞతలు తెలియజేస్తోంది. ఉదయం పుస్తకాలను ఆదరించాలని కోరుతున్నాం.

# ‘ఉదయం’ పుస్తకాలు ఎందుకోసం?

**ప్రతి** మనిషికీ తనకంటూ కొన్ని సొంత అభిప్రాయాలు, నమ్మకాలు, వాదనలు వుంటాయి. వాటిని సమాజంతో పంచుకోగలిగినప్పుడు వాటికి మద్దతుదారులు, సానుభూతిపరులు ఏర్పడ తారు. ఈ మద్దతు పెరిగేకొద్దీ వారి అభిప్రాయాలు మరింత బలమైనవిగా మారుతుంటాయి. జనం ఆకాంక్షల్ని ప్రతిఫలించడంలో అవి విజయవంతమయ్యే కొద్దీ వాటికి భౌగోళిక ఎల్లలు కూడా చెరిగిపోతాయి. వాటిని అవలంబించేవారి వాదనలకూ విలువ లభిస్తుంది.

సామాజిక, రాజకీయ జీవితంలో వున్నవారికి ప్రపంచాన్ని చదవడం ప్రధానమైన లక్షణం కావాలి. తాము నమ్మే వాదంతో సంబంధం లేకుండా, ప్రతి వాదాన్నీ, ప్రతి నినాదాన్నీ అర్థం చేసుకోవాలి, వాటిపై అవగాహన పెంచుకోవాలి. వాటన్నిటినీ సమన్వయం చేసుకుంటూ తన సొంత అభిప్రాయాలు, భావజాలాన్ని బలోపేతం చేసుకోవాలి. అలా తమను తాము విషయ పరంగా తీర్చిదిద్దుకున్నవారే జనజీవితంలో గట్టిగా నిలబడగలుగుతారు. దేశానికి ఎప్పుడూ అవసరమైంది ఇలాంటివారే!

మరోవైపు, విద్యార్థి దశ లోనే ఆయా భావజాలాల గురించిన పరిచయం జరగాలి. దురదృష్ట వశాత్తూ మన చదువులు సంకెళ్లను బిగించే అస్త్రాలుగానే తప్ప, జ్ఞానాన్ని నింపే శస్త్రాలుగా లేవు. ఈ ధోరణి మారాలి. 12వ తరగతికి చేరే నాటికే విద్యార్థులకు ప్రపంచం గురించి, భిన్న ధోరణులు, నాయకులు, తత్వవేత్తలు, శాస్త్రవేత్తల గురించి కనీసావగాహన ఏర్పడివుండాలి. ప్రతి విద్యార్థికీ తమకంటూ సొంత అభిప్రాయాలుంటాయి. ఈ అవగాహన వాటిలో వున్న లోపాల్ని తొలగించడంతోపాటు, తమ వాదనల్ని మరింత బలపరచుకోవడానికి పనికొస్తుంది.

‘ఉదయం’ ఒక సామాజిక, రాజకీయ సంధాన వేదికగా పనిచేస్తోంది. నలుగురూ కూర్చుని సామూహికంగా నిర్ణయాలు తీసుకునే రోజులు పోయివుండవచ్చు; కానీ, ప్రజలు ఎప్పుడూ సమాజంలో భాగమే! వారి అభిప్రాయాలకు ఎప్పటికీ విలువ తగ్గదు. ఆయా అంశాల వారీగా అందరి మధ్య సంధానం కుదర్చడం, ఫలితాల్ని సాధించడం ‘ఉదయం’ ప్రధాన ఎజెండా. అలాగే, అభిప్రాయాలు, వాదనల మధ్య సంధానం కుదర్చడం కూడా ఇందులో భాగమేనని మేము బలంగా నమ్ముతున్నాం. ఇందులో భాగంగానే ఈ చిన్న పుస్తకాలను ప్రచురిస్తున్నాం.

‘ఉదయం’ ప్రత్యేకించి ఒక వాదాన్ని బలపరచదు. అంతిమంగా ప్రజలకు మంచి పరిపాలన అందడమే లక్ష్యంగా పనిచేస్తుంది. మేము విడుదల చేస్తున్న పుస్తకాలు వందలాది వాదాలపై ఎవరికివారు సొంత అభిప్రాయాలు ఏర్పరచుకోవడానికి ఉపయోగపడతాయి. మా పుస్తకాలకు, కార్యకలాపాలకు మీ ఆదరణ లభిస్తుందని, అది శాశ్వతంగా కొనసాగుతుందని మా విశ్వాసం. ధన్యవాదాలు.

**- సురేశ్ వెలుగూరి**

***చీఫ్ ఎడిటర్, ఉదయం పబ్లిషింగ్ హౌస్***

సుందర్ పిచాయ్

# వెలుగురేఖల వేటగాడు



అకడమిక్ విద్యార్హతలు అవసరమే, కానీ అవే అతిముఖ్యమైనవి కాదు. మీ కెరియర్‌లో ప్రతిచోటా మీకెదురయ్యే ఒత్తిళ్లు, పరిణామాలకు మీ విద్యార్హతలు మాత్రమే పరిష్కారాల్ని ఇవ్వలేవు. మీరు హైస్కూల్లో వున్నప్పుడు కాలేజీ గురించి ఆలోచిస్తారు. కాలేజీలో వున్నప్పుడు ఐఐటీల గురించి, ఐఐటీల్లో వున్నప్పుడు ఐఐఎమ్‌ల గురించీ ఆలోచిస్తారు. కానీ, ఇవేవీ వారికి లోకజ్ఞానాన్నివ్వలేవు. పెద్ద పెద్ద విద్యాసంస్థల్లో సీటు దొరకడమంటే సక్సెస్ సాధించేసినట్లు కాదు, అందుకోసం పాటించాల్సిన పద్ధతులు, ఎదుర్కోవాల్సిన సవాళ్లు వేరేవున్నాయి.

**– ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మాట్లాడుతూ సుందర్ పిచాయ్ –**



# వెలుగు రేఖల వేటగాడు | INDEX


| | |
|---|---|
| 1) సుందర్ గురించే ఎందుకు? | 09 |
| 2) బొద్దింక నేర్పిన పాఠం | 11 |
| 3) మద్రాసు వీధుల నుంచి ... | 13 |
| 4) భిన్నత్వానికి చిరునామా | 18 |
| 5) సుందర్ & అంజలి : ఒక అందమైన ప్రేమకథ | 20 |
| 6) స్ట్రాంగ్ మెమరీ – సుందర్ సూత్రం | 22 |
| 7) భాష – బలమైన ఆయుధం | 24 |
| 8) సుందర్ పిచాయ్ – 12 సక్సెస్ సూత్రాలు | 26 |
| 9) భవిష్యత్తు కృత్రిమ మేధస్సుదే | 32 |
| 10) మీలో లీడర్‌ని నిద్రలేపే 3 లక్షణాలు | 39 |
| 11) భారతీయ యువతకు గూగుల్‌లో గొప్ప అవకాశాలు | 39 |
| 12) సుందర్ పిచాయ్ ఫొటో రైటప్స్ | 42 – 47 |

జీవితంలో ఒక అడుగు వెనక్కి పడుతున్నప్పుడో, నిరుత్సాహం పెరుగుతున్నప్పుడో ... కాస్తంత ధైర్యాన్ని, ప్రోత్సాహాన్నీ ఇచ్చే మనుషుల కోసం వెతుక్కుంటాం. వారినుంచి తీసుకునే స్ఫూర్తితో మన ప్రయాణాన్ని మళ్లీ మొదలుపెడతాం; పరిస్థితుల్ని అధిగమించ డానికి కొత్త శక్తితో పనిచేస్తాం.

ఆ స్ఫూర్తిని మనకిచ్చే వ్యక్తులు మన బంధుమిత్రులో, సన్నిహితులో అవాల్సిన అవసరం లేదు. భూగోళం మీద ఎక్కడున్నా తమ ఆలోచనలు, కార్యకలాపాలతో ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న వ్యక్తులకు కొదవే లేదు. ప్లేటో నుంచి జిడ్డు కృష్ణమూర్తి దాకా; ఎడిసన్ నుంచి శ్రీనివాస రామానుజన్ దాకా; మండేలా నుంచి జయప్రకాష్ నారాయణ్ దాకా ... కొన్ని లక్షలమంది నాయకులు అనేక తరాలకు స్ఫూర్తినిస్తూవస్తున్నారు.

రంగమేదైనా కావచ్చు. జీవన ప్రయాణంలో ఎప్పటికప్పుడు కొత్త శక్తిని పుంజుకోవడానికి ఇటువంటి వ్యక్తుల నుంచి స్ఫూర్తిని తీసు కోవడం అవసరమనే భావనతో, కొందరు స్ఫూర్తి ప్రదాతల జీవన ప్రయాణాల్ని ఇలా చిన్నచిన్న పుస్తకాల రూపంలో ప్రచురిస్తున్నాం. గూగుల్ కీలక సారథి సుందర పిచాయ్ జీవితం నుంచి తీసుకున్న కొన్ని అంశాలతో ఈ తొలి పుస్తకాన్ని విడుదల చేస్తున్నాం.



# సుందర్ గురించే ఎందుకు?

**సుందర్** పిచాయ్‌ను చూస్తే చాలా సాదాసీదాగా, 'రఘువరన్ బి.టెక్' సినిమాలో ధనుష్ లాగా కనిపిస్తాడు. కళ్లలో నిరంతరాయంగా కనిపించే మెరుపు, నవ్వు ముఖం, కాస్తంత అమాయకత్వమూ కనిపిస్తాయి. ఒక చిక్కటి జ్ఞానరేఖ అతని ముఖం నిండా పరుచుకున్నట్లు కనిపిస్తుంది. మనకు బాగా తెలిసిన కుర్రాడే అనిపిస్తుంది.

అయితే, గూగుల్ సీఈఓ కాకముందు మనమెప్పుడైనా సుందర్‌ని చూశామా? సుందర్ గురించి ఎప్పుడైనా నాలుగు మాటలు మాట్లాడుకున్నామా? గూగుల్‌లో చేరకముందే అతను ఎంతో కష్టపడి, ఎన్నో మెట్లెక్కాడు కదా? గూగుల్ కంటే ముందే కొన్ని కంపెనీల్లో పనిచేశాడు కదా? అప్పుడెప్పుడూ వార్తల్లో లేని సుందర్ ఇప్పుడెందుకు ప్రపంచ వార్తల్లో నోటెడ్ పర్సనాలిటీగా మారాడు? కోట్లాదిమంది భారతీయులకు ఒక స్ఫూర్తిచిహ్నంగా ఎలా నిలిచాడు? పైగా ఇలా పుస్తకాలు రాయాల్సినంత కంటెంట్‌కి సుందర్‌ని ఎందుకు కేంద్రంగా మారుస్తున్నాం?

ప్రపంచపు నెంబర్‌వన్ కంపెనీ గూగుల్‌కి సీఈఓ కాబట్టి మనమిప్పుడు సుందర్ గురించి మాట్లాడు కుంటున్నామా? మన భారతీయుడు కాబట్టి, పైగా దక్షిణ భారతీయుడు కాబట్టి సుందర్ మీద 'మనవాడు' అనే ముద్ర వేసి, మనలో కలుపుకుంటున్నామా? లేదా, ఇంకేవైనా కారణాలున్నాయా?

జీవితంలో పలు విజయాలు సాధించిన ఒక మనిషి గురించి మాట్లాడుకునేప్పుడు ఇలాంటి కొన్ని ప్రశ్నలకు ఖచ్చితంగా సమాధానాలు వెతుక్కోవాలి. ఎందుకంటే ... ప్రశ్న నుంచే ప్రపంచం ఉద్భవిం చిందనే సత్యాన్ని మనమందరం నమ్ముతాం కాబట్టి.

ఒక్కో కాలానికీ, ఒక్కో తరానికీ కొందరు స్ఫూర్తిప్రదాతలు పుడుతుంటారు. ఆ కాలానికి తగినట్లు చరిత్రను రాస్తుంటారు. ఆ కాలం మారిపోగానే మళ్లీ కొత్తతరం స్ఫూర్తిప్రదాతలు పుడుతుంటారు. ఇలా ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కర్తలు పుడుతూనేవుంటారు; పాత ఆవిష్కర్తలు కాలం చేస్తూనే వుంటారు. కానీ, ఎండ్ ఆఫ్ ది డే ... ఈ భూమ్మీద వాళ్లు వదిలిపెట్టి వెళ్లిన ముద్రలు మాత్రం చిర కాలం అలా వుండిపోతాయి. క్రీస్తుపూర్వం నుంచీ ఇప్పటిదాకా ప్రపంచం సలాం చేసిన నాయకులం దరూ కాలంతో సంబంధం లేకుండా చరిత్రలో మిగిలిపోయారు. ఈ కాలంలో అలా చరిత్రలో మిగిలి పోయేవాళ్లలో ఒక్కడుగా నిలబడ్డాడు కాబట్టే మనం సుందర్ గురించి మాట్లాడుకుంటున్నాం.

ప్రతి మనిషి విజయ ప్రస్థానానికీ కొన్ని మూలసూత్రాలుంటాయి. గణితంలో ఎలాగైతే స్టెప్స్ ద్వారా ఆఖరి ఫలితాన్ని రాబడతామో, ఒక మనిషి సాధించిన ఫలితాల్నీ స్టెప్స్ ద్వారానే గుర్తించాలి. ఆ మెట్లే లేకుండా అతని జయం సాధ్యమయ్యేది కాదు. సుందర్‌ని కూడా ఇలా మెట్ల మార్గంలోనే గుర్తిస్తున్నాం.

ఎక్కడ మొదలుపెట్టాడు; ఎలా ప్రయాణం చేశాడు; ఏ శిఖరాలకు చేరాడో సుందర్ జీవితం లోని మెట్ల వరుసను ఇవ్వాల్టి తరానికి తెలియజేయగలిగితే సుందర్ లాంటి మరికొంతమందిని తయారు చేసుకోవడానికి అవకాశమిస్తుంది. కాబట్టే సుందర్ పిచాయ్ గురించి మనమిలా మాట్లాడుకుంటు న్నాం. అతని జీవితాన్ని కేంద్రంగా చేసుకుని ఇలా పుస్తకాలూ ముద్రిస్తున్నాం.

సుందర్ పిచాయ్ కలల బేహారి. టెక్నాలజీ అండతో గూగుల్ ఏ కలలు కంటోందో ఆ కలల్ని సాకారం చేయడానికి, కొత్త ప్రపంచానికి దారులు తెరవడానికీ సుందర్ మానవ ప్రయత్నం చేస్తున్నాడు. మానవాళిని మరింత ముందుకు తీసుకువెళ్లే సరికొత్త ఆవిష్కరణల వెలుగురేఖల వైపు ప్రయాణిస్తున్నాడు. కొత్త ఆలోచనలు, కొత్త మార్గాల కోసం వేటగాడిలా అన్వేషిస్తున్నాడు. ఈ అన్వేషణ మరెందరికో దిక్సూచి కావాలి.

మద్రాసులో ఒక మధ్యతరగతి ఉద్యోగి ఇంట్లో పుట్టిననాటినుంచీ గూగుల్ సీఈఓగా మారేదాకా సుందర్ జీవితంలో ఎన్నో పార్శ్వాలు, మరెన్నో అడ్డుగోడలు, ఇంకెన్నో పాకుడురాళ్లు. అయితేనేం, నలభై ఐదేళ్లకే ఎవరెస్టంత లక్ష్యాన్ని చేరుకోగలిగాడు. ఈ ప్రస్థానం ఎలా జరిగిందో ఇవ్వాల్టి తరం భారతీయ యువతీ యువకులకు తెలియాలి. మరికొందరు భారతీయులు సుందర్ లాగే నవ్యభారత ఆవిష్కర్తలుగా మారాలి. అందుకోసం ఈ చిన్న పుస్తకం ఉపయోగపడుతుందని మా విశ్వాసం.

సుందర్ ఎప్పటికీ మర్చిపోలేని తన అనుభవంతో ఈ పుస్తకాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ తొలి పాఠం నేర్చుకున్న తరువాత అతని బాల్యం నుంచీ గూగుల్ దాకా అనేక విషయాలు వివరంగా మాట్లాడు కుందాం. మరి నడవండి.

# బొద్దింక నేర్పిన పాఠం

**చాలా** ఏళ్లకిందటి మాట. నేనొక రెస్టారెంట్‌లో కూర్చుని కాఫీ తాగుతున్నాను. ఒక బొద్దింక అటుగా పోతూ ... కాఫీ తాగుతున్న ఒక మహిళ భుజం మీద వాలింది. అకస్మాత్తుగా తన భుజమ్మీద పడిన బొద్దింకను చూడగానే ఆమె కంగారుపడిపోయింది. భయంతో వణికిపోతూ, ఊగిపోతూ ఒకవిధమైన ఉన్మాదస్థితికి చేరిపోయింది. తన చేతిలోని కాఫీ కప్పును జారవిడిచేసింది. తన టేబుల్ మీదున్న వస్తువుల్ని చెల్లాచెదురు చేసింది. బొద్దింకను తరమడానికి తన రెండు చేతుల్నీ అస్త్రాలుగా మార్చి, గాలిలో ఫైట్ చేయడం మొదలుపెట్టింది.

కాసేపటి తర్వాత ఎలాగో ఆమె బొద్దింకను తన శరీరం మీదినుంచి పారదోలింది. కానీ ఆ చుప్పనాతి బొద్దింక వెళ్లి ఇంకో మహిళ భుజమ్మీద వాలింది. ఆమె తరిమితే ఇంకొకరి మీద, మరొకరి మీద ... ఇలా అక్కడున్న మహిళలందరి మీదా అది వాలుతూపోయింది. అంతే, అసలే బొద్దింకలంటే చచ్చేంత భయమున్న మహిళలందరూ వణికిపోతూ అక్కడున్న టేబుళ్లను చెల్లాచెదురు చేశారు. అప్పటిదాకా ఆహ్లాదంగా వున్న అక్కడి వాతావరణం కొన్ని నిముషాల్లోనే వేడెక్కిపోయింది.

ఇంతలో అక్కడికో కూల్ వెయిటర్ వచ్చాడు. తెల్లటి బట్టలతో కొత్తమనిషి కనిపించగానే బొద్దింక వెళ్లి ప్రేమగా అతని భుజమ్మీద వాలిపోయింది. అతను ఏమాత్రం తొట్రుపడలేదు. బొద్దింక తన భుజమ్మీద అటూఇటూ కదలకుండా సెటిల్ అయ్యేదాకా ఓపిగ్గా ఎదురుచూశాడు. ఆతర్వాత నెమ్మదిగా పేపర్ నేప్కిన్ సాయంతో దానిని పట్టుకుని బయటికి తీసుకువెళ్లి విడిచిపెట్టేశాడు. అంతే, ఒక్క నిముషంలో వాతావరణం మామూలు స్థితికి చేరిపోయింది.

నా మానాన నేను కాఫీ తాగుతూ ఈ తమాషా సంఘటనను జాగ్రత్తగా గమనిస్తున్నాను. నా మనసులో కొన్ని ప్రశ్నలు రూపుదిద్దుకుంటున్నాయి. జరిగిన ఘటనలో అసలు బొద్దింకకేమైనా బాధ్యత వుందా? మహిళల్ని భయకంపితుల్ని చేసిన ఆ బొద్దింక వెయిటర్‌ను ఎందుకు భయపెట్టలేక పోయింది? కారణం ఒక్కటే. అతను బొద్దింకను సమస్యగా భావించలేదు. పరిస్థితి 'అదుపులోకి వచ్చే దాకా' ఎదురుచూశాడు. అనువైన సమయం రాగానే దానిని బయటికి తీసుకువెళ్లి పరిస్థితిని అదుపు చేశాడు. కొందరిని అస్థిమితంగా మార్చిన పరిస్థితిని అతను చాలా కూల్‌గా ఎదుర్కొన్నాడు. ఇక్కడ తప్పు బొద్దింకది కాదు, ఆ పరిస్థితిని ఎదుర్కోలేకపోయిన మహిళలది అని నిరూపించాడు.

ఈ చిన్నపాటి ఘటన నాలో చాలా ఆలోచనలు రేకెత్తించింది. చాలాసేపు ఆలోచిస్తూ అలా

కూర్చుండిపోయాను. నా తండ్రి కావచ్చు; నా భార్య కావచ్చు; నా బాస్ కావచ్చు; వారెప్పుడైనా నా మీద అరిస్తే వారిమీద ఎందుకు కోపం ప్రదర్శిస్తున్నాను? నిజానికి వారు నామీద అరిచారంటే నావైపునుంచి ఏదో పొరపాటో, తప్పో జరిగిందనే కదా అర్థం? కానీ, నేనా పరిస్థితిని ఎదుర్కోకుండా, కంగారుపడి రాద్ధాంతం చేస్తే ... అది నా తప్పే కదా? ఇంట్లో, ఆఫీసులో, ఆఖరికి ట్రాఫిక్‌జామ్‌లో కూడా ఇలాగే సహనం కోల్పోతుంటాం. ఇలా సహనం కోల్పోయిన ప్రతిసారీ పరిస్థితి అదుపు తప్పుతుంటుంది. మరిన్ని కొత్త ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఒక చిన్న గుంట నుంచి ఒక పెద్ద ఊబి లోకి పడిపోయిన ఫీలింగ్ ఎదురవుతుంటుంది.

పై ఘటన నాకో పెద్ద పాఠాన్ని నేర్పింది. నా ఆలోచనా విధానాన్ని మార్చింది. మన జీవితంలో ఎదురయ్యే పలు తరహాల పరిస్థితులకు కంగారుపడాల్సిన అవసరం లేదని, వాటిని అర్థం చేసుకుని, పరిష్కారాలు సాధించడం ముఖ్యమని గుర్తించాను. బొద్దింకను చూసి భయపడిన మహిళ తనతోపాటు తన చుట్టుపక్కల వున్న అందరినీ కంగారుపడేలా చేసింది. కానీ వెయిటర్ మాత్రం పరిస్థితిని ప్రశాం తంగా అదుపులోకి తీసుకువచ్చాడు. కారణం – పరిస్థితిని అతను సవ్యంగా అర్థం చేసుకోవడమే!

చాలా సందర్భాల్లో మనం ఎలాంటి ఆలోచన లేకుండా స్పందించేస్తాం. ఏదో ఒక మాట అనేస్తాం. కానీ, విషయం అర్థమయ్యాక మన స్పందనను మళ్లీ సమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.

జీవితాన్ని అర్థం చేసుకోవడానికి 'రాకెట్ ఫార్ములాలు' అవసరం లేదు. చాలా సింపుల్‌గా, అందంగా దానిని అర్థం చేసుకోవచ్చు. మేము చాలా సంతోషంగా వున్నామని భావించేవారిలో ఎక్కువమందికి ఆ సంతోషం డబ్బు ద్వారానే వస్తుంది తప్ప మానసికంగా కాదు. మన మనస్తత్వం పాజిటివ్‌గా వుందని, మానసికంగా స్వచ్ఛంగా వున్నామని భావించేవారి జీవితంలో వుండే ఆనందం ... లెక్కలకు అందనిది; తూకాలకు దొరకనిది. కాబట్టి మీ జీవితం లోకి కోపతాపాల్ని, ద్వేషాల్ని, ఈర్ష్య, అసూయల్లాంటి బొద్దింకల్ని రానివ్వకండి. అవి మీ జీవితానికి ప్రమాదకరం కాకపోవచ్చు. కానీ, మిమ్మల్ని ఒకదానివెంట ఇంకో కందకాల్లోకి దించేస్తాయి. జరిగిందంతా మంచికని, జరగబోయేదీ మంచికేనని గట్టిగా గుర్తుపెట్టుకోండి.

ఈ కథ మీకు చాలాకాలంపాటు గుర్తుండిపోతుందని నా నమ్మకం. జీవితం – సృష్టి మనకిచ్చిన గొప్ప వరం. ఎంత పెద్ద సమస్య ఎదురైనా భయపడి పానిక్‌గా మారకండి. ధైర్యం, సానుకూల వైఖరితో దానిని ఎదుర్కోండి. సహనాన్ని సాధ్యమైనంత ఎక్కువగా అక్కున చేర్చుకోండి. ఇక భయం మీ నీడను కూడా తాకదు.

చివరగా నేను మహిళలకు విజ్ఞప్తి చేసేదేమిటంటే – బొద్దింకలకు భయపడకండి. అవి చాలా చిన్నపాటి పురుగులు. సింహాలూ పులులూ కావు.


**తాను చదువుకున్న ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఈతరం విద్యార్థులతో మాట్లాడుతూ సుందర్ పిచాయ్ పంచుకున్న కథనం ఇది.**

# మద్రాసు వీధుల నుంచి ...

**సుందర్** పిచాయ్ అని వ్యావహారికంలో మనం పిలుచుకునే 'పిచాయ్ సుందరరాజన్' 1972 జులై 12న తమిళనాడు రాష్ట్రం మదురైలో అమ్మమ్మ ఇంట్లో పుట్టాడు. తండ్రి రఘునాథ్ పిచాయ్ జనరల్ ఎలక్ట్రికల్ కంపెనీ (జీఈసీ)లో ఎలక్ట్రికల్ ఇంజనీరు. మద్రాసులో జీఈసీ ఎలక్ట్రికల్ ఉత్పత్తులు తయారుచేసే ఒక ఫ్యాక్టరీకి ఆయన మేనేజర్‌గా వుండేవారు. సుందర్ తల్లి లక్ష్మి, ఆమె కూడా సుందర్ పుట్టేదాకా స్టెనోగ్రాఫర్‌గా పనిచేసింది. రఘునాథ్ పిచాయ్ కుటుంబం మద్రాసులో రెండు గదులున్న ఒక చిన్న ఇంట్లో చాలా తక్కువ సదుపాయాలతో నివాసం వుండేది.

చెన్నయ్ లోని జవహర్ విద్యాలయలో సుందర్ తన స్కూలు, ఇంటర్మీడియట్ చదువు పూర్తిచేశాడు. అనంతరం ఖరగ్‌పూర్ ఐఐటీలో మెటలర్జికల్ ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేశాడు. ఐఐటీ రోజుల్లోనే అతని ప్రొఫెసర్లు అమెరికా వెళ్లి స్టాన్‌ఫోర్ట్ యూనివర్సిటీ నుంచి పిహెచ్.డి పూర్తిచేయమని సూచించారు. సుందర్ వారు చెప్పిన యూనివర్సిటీకే వెళ్లాడు కానీ, పిహెచ్.డికి బదులు మెటీరియల్ సైన్సెస్ & ఇంజనీరింగ్‌లో ఎమ్.ఎస్ చదువుకున్నాడు.

స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకోవాలనే సుందర్ కోరిక తీర్చడానికి అతని తండ్రి తన ఏడాది జీతం కంటే ఎక్కువ డబ్బును కంపెనీ నుంచి ఏకమొత్తంగా తీసుకున్నారు. ఇంకా, అప్పటిదాకా తాను పొదుపు చేసిన డబ్బంతా ఖర్చుపెట్టాడు.



Live in the present and shape the future, do not be casting lingering looks to the distant past for the past has passed away, never again to return.

– Subrahmanya Bharati

స్టాన్‌ఫోర్డ్‌లో ఎమ్ఎస్ పూర్తిచేశాక మెటీరియల్స్ సైన్సెస్‌లో పిహెచ్.డి పూర్తిచేసి ప్రొఫెసర్‌గా స్థిర పడాలన్నది సుందర్ ఆలోచన. కానీ ఇక్కడ కూడా తన మార్గాన్ని మార్చుకుని పిహెచ్.డి ఆలోచనను విడిచిపెట్టాడు. సిలికాన్ వేలీలో సెమీకండక్టర్లు తయారుచేసే 'అప్లయిడ్ మెటీరియల్స్' అనే కంపెనీలో ఇంజనీర్ & ప్రాడక్ట్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరిపోయాడు. 2002లో ఉద్యోగం వదిలిపెట్టి 'వార్టన్ ఆఫ్ ది యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా'లో ఎంబిఎ చదవడానికి చేరాడు. అక్కడ సుందర్‌ని సీబెల్ స్కాలర్ అనీ, పామర్ స్కాలర్ అనీ పిలిచేవారట.

ఆతర్వాత మికిన్సీ & కంపెనీలో మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా చేరి కొద్దికాలం పనిచేశాడు. అంతే, అదే లాస్ట్ బట్ వన్ జంప్. చిట్టచివరిసారిగా అతను చేసిన జాబ్ జంప్ ... మళ్లీ జీవితంలో అతను వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండాపోయింది.

## గూగుల్ లైఫ్

మికిన్సీ & కంపెనీ విడిచిపెట్టి 2004లో సుందర్ గూగుల్‌లో ఉద్యోగిగా చేరాడు. ప్రాడక్ట్ మేనేజ్‌మెంట్‌తో పాటు గూగుల్ రూపొందించడం కోసం అవసరమైన కొత్త ఉత్పత్తులను గుర్తించడం అతని బాధ్యతలు. వీటితోపాటు 'గూగుల్ డ్రైవ్'ను విజయవంతమైన ప్రాడక్టుగా మార్చడం కూడా అతని విధుల్లో భాగం చేశారు.

సుందర్ గూగుల్‌లో పని ప్రారంభించిన కొద్దికాలానికే గూగుల్ మాస్టర్‌మైండ్స్‌లో ఒకడిగా మారిపోయాడు. అత్యంత మేథోశక్తిగల గూగుల్ ఉద్యోగుల్లో ఒకరిగా కంపెనీలో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నాడు.

## వేగంగా మారిన పరిణామాలు

గూగుల్‌లో సుందర్ దశ రెండోసారి తిరిగింది. గూగుల్ సెర్చ్ టూల్‌బార్‌ను రూపొందించే బృందంలో సభ్యుడయ్యాడు. గూగుల్ శోధన (సెర్చ్)ను యూజర్లకు మరింత సులభతరం చేయడానికి జరిగిన అనేక కృషియత్నాల్లో భాగమయ్యాడు. ఆతర్వాత జీమెయిల్, గూగుల్ మ్యాప్స్ వంటి పలు తరహాల గూగుల్ యాప్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో పనిచేశాడు.

తన అనుభవం, కఠోర శ్రమతో గూగుల్ టూల్‌బార్‌ను భారీ సక్సెస్ చేయడంతో సుందర్‌కి కంపెనీలో కోరుకున్న స్థాయికి వెళ్లగల అవకాశం, గుర్తింపు చిక్కాయి. ఈ విజయమే సుందర్‌ని ... గూగుల్‌కి తనకంటూ ఒక సొంత బ్రౌజర్‌ను తయారుచేయాలనే దిశగా పరుగులు పెట్టించింది. తన ఆలోచనను సుందర్ .. కంపెనీ కోఫౌండర్ లారీ పేజ్, అప్పటి గూగుల్ సీఈఓ ఎరిక్ షిమిద్‌లతో పంచుకున్నాడు. సొంత బ్రౌజర్‌ను రూపొందించడం చాలా ఖర్చుతో కూడుకున్న పని అంటూ ఎరిక్ మొదట అభ్యంతరపెట్టాడు. కానీ, ఏదోవిధంగా సుందర్ లారీపేజ్, మరో కోఫౌండర్ సెర్జీ బ్రిన్‌ను కన్విన్స్ చేయగలిగాడు.

అప్పటికే మార్కెట్లో వున్న ఇంటర్‌నెట్ ఎక్స్‌ప్లోరర్, మొజిల్లా ఫైర్‌ఫాక్స్ మొదలైన బ్రౌజర్లలో వున్న సమస్యలేవీ తమ సొంత బ్రౌజర్‌లో లేకుండా చేస్తానని, యూజర్లు అతిసులభంగా దీనిని ఉపయోగిం

చేలా తీర్చిదిద్దుతానని సుందర్ కంపెనీ మేనేజ్‌మెంట్‌కి నమ్మకమిచ్చాడు. వేగంగా మారుతున్న ప్రపంచానికి తగిన 'ది బెస్ట్' బ్రౌజర్‌ని తయారుచేయిస్తానని మాటిచ్చాడు. 2008లో తన మాటను స్పష్టంగా నిలబెట్టుకున్నాడు. తన కొత్త ప్రొడక్టును గూగుల్ కిరీటంలో కలికితురాయిగా నిలబెట్టాడు. అదే ఈరోజు ప్రపంచంలోనే ఎక్కువమంది వినియోగించే బ్రౌజర్ ...

## ... గూగుల్ క్రోమ్

మనందరికీ తెలిసిందే; గూగుల్ ఉత్పత్తులన్నిటిలో ఇప్పుడు నెంబర్‌వన్ ఉత్పత్తి గూగుల్ క్రోమ్. ఇంత భారీ విజయాన్ని తొలుత ఎవరూ ఊహించలేదు. క్రోమ్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తొలి లక్ష మంది యూజర్లు స్థిరంగా నిలబడితే చాలు, మార్కెట్‌లో వ్యాపించగలుగుతామన్న సుందర్ అంచనా ఏమాత్రం తప్పలేదు. చాలా కొద్దికాలంలోనే క్రోమ్ ... ప్రపంచవ్యాప్తంగా 45 శాతం మంది ఇంటర్‌నెట్ యూజర్లు వినియోగించే బ్రౌజర్‌గా మారిపోయింది. తన పోటీదారులు ఇంటర్‌నెట్ ఎక్స్‌ప్లోరర్, మొజిల్లా ఫైర్‌ఫాక్స్‌లను అణగదొక్కుతూ విజయబావుటా ఎగరేసింది.

క్రోమ్ బ్రౌజర్ విజయం ఆతర్వాత గూగుల్ క్రోమ్ ఆపరేటింగ్ సిస్టమ్, క్రోమ్ బుక్స్, క్రోమ్ కేస్ట్ వంటి ఉత్పత్తులను రూపొందించడానికి దోహదం చేసింది.

ఈ అసాధారణ విజయాలతో సుందర్ రాత్రికి రాత్రి ఒక సెన్సేషన్‌గా మారిపోయాడు. విశ్వ వ్యాప్తంగా గుర్తింపు పొందాడు. 2008 లోనే సుందర్ గూగుల్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా ప్రమోషన్ పొందాడు. అప్పటిదాకా స్క్రీన్ వెనుకే పనిచేసిన సుందర్ ... గూగుల్ ప్రెజెంటేషన్ల ఈవెంట్లలో తరచూ కనిపించడం, గూగుల్ ఉత్పత్తుల గురించి వివరించడం మొదలైంది.

2009లో క్రోమ్ ఆపరేటింగ్ సిస్టమ్, క్రోమ్ బుక్‌ల డెవలప్‌మెంట్, డెమాన్‌స్ట్రేషన్ జరిగాయి. మనందరికీ తెలిసిందే – క్రోమ్ ఆపరేటింగ్ సిస్టమ్ ప్రధానంగా ల్యాప్‌టాప్‌ల కోసం రూపొందించింది. ఇది సిస్టమ్ లోని హార్డ్‌డిస్క్ ద్వారా కాక క్లౌడ్ ద్వారా పరిమితి లేని స్పేస్‌ని ఇస్తూ పనిచేస్తుంది. తక్కువ ధరల్లో లభించే క్రోమ్ నోట్‌బుక్స్‌లో దీనిని ఉపయోగించుకోవచ్చు.



2010లో సుందర్ గూగుల్ నుంచి తొలి ఓపెన్‌సోర్స్ వీడియో కోడెక్ 'విపి8' (వీడియో కంప్రెసింగ్ ఫార్మాట్)ను ప్రకటించాడు. 'వెబ్‌ఎమ్' పేరుతో సరికొత్త వీడియో ఫార్మాట్‌ను విడుదల చేశాడు. కంప్రెస్ అయివున్న పలు తరహాల వీడియో ఫార్మాట్లను తెరవడమే కాక, వీడియో స్ట్రీమ్స్, ఆడియో స్ట్రీమ్స్, టెక్స్ట్ ట్రాక్‌లను కూడా ఇది సమర్థవంతంగా పనిచేయిస్తుంది.

రెండేళ్ల తరువాత ... 2012లో సుందర్ క్రోమ్ & యాప్స్ విభాగానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అయ్యాడు. గూగుల్ సామ్రాజ్యానికి సీఈఓ అయ్యే ప్రయాణం ఇక్కడే ప్రారంభమైంది.

## గూగుల్ సీఈఓ దిశగా ...

సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అయిన ఏడాది కాలంలోనే సుందర్‌కి అప్పటిదాకా ఆండీ రూబిన్ నిర్వహిస్తున్న ఆండ్రాయిడ్ ఓఎస్ బాధ్యతను కూడా అప్పగించారు. అప్పటిదాకా స్మార్ట్‌వాచ్‌లు, టీవీలు, కార్లు, డబ్బు చెల్లింపులకు ప్లాట్‌ఫారంగా వున్న ఆండ్రాయిడ్‌ను తన చేతుల్లోకి తీసుకోగానే సుందర్ 'ఆండ్రాయిడ్ వన్' పేరుతో ఒక కొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేశాడు. ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్ ఫోన్లకు ఉపయోగపడే సులభమైన ఆపరేటింగ్ సిస్టమ్‌ను రూపొందించే కృషి ప్రారంభించాడు. సుందర్ మార్గదర్శకత్వంలో చాలా కొద్దికాలంలోనే ఆండ్రాయిడ్ ఓఎస్ మూడు కొత్త వెర్షన్లను (జెల్లీ బీన్, కిట్‌క్యాట్, లాలీపప్) విడుదల చేసింది. అమెరికాలో వినియోగించే స్మార్ట్ ఫోన్లలో 65% మార్కెట్‌ను ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమే ఆక్రమించేసింది.

ఒకవైపు పై బాధ్యతల్లో వుంటూనే సుందర్ 'రూబా ఇంక్' కంపెనీ సలహామండలిలో సభ్యుడిగా, జైవ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టర్‌గా కూడా వ్యవహరించాడు. ఆతర్వాత కొద్దికాలానికే ... 2014లో సుందర్ ఉత్పత్తుల విభాగం హెడ్‌గా లారీ పేజ్ తర్వాత రెండో స్థానానికి ప్రమోటయ్యాడు.

ఎంత ఎదిగితే అంత ఎక్కువ బాధ్యతలు పంచుకోవాల్సివస్తుంది. సుందర్ పరిస్థితి కూడా అదే. సీఈఓ కాగానే బాధ్యతలు కూడా భారీగా పెరిగాయి. కంపెనీ రోజువారీ వ్యవహారాలు చూడడంతో పాటు ... గూగుల్ పెద్ద ప్రొడక్టులైన గూగుల్ మ్యాప్స్, సెర్చ్ & అడ్వర్టయిజింగ్‌ల నిర్వహణ కూడా అతని పైనే పడింది. వీటికితోడు గూగుల్ సరికొత్త ఉత్పత్తులు గూగుల్ ఫొటోస్, గూగుల్ నౌ (వాయిస్ రికగ్నిషన్ అసిస్టెంట్)ల డెవలప్‌మెంట్ వ్యవహారాల్లో కూడా సుందర్ ఒక కీలక బాధ్యుడయ్యాడు.

మరోవైపు సుందర్ ... గూగుల్ ప్రతినిధిగా ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నాడు. గూగుల్ వార్షిక డెవలపర్ల సదస్సు, అందులో ప్రెజెంటేషన్లను నిర్వహిస్తూ గూగుల్ తరపున పబ్లిక్ ఫిగర్లలో ఒకడయ్యాడు.

గూగుల్ కీలక బృందంలో ఒకడిగా మారడానికి సుందర్‌కి సాయం చేసిన అంశాలు రెండు. ఒకటి – అతని **సౌహార్ద్ర సంబంధాలు**, రెండోది – అతని **ఎంట్రపెన్యూర్ నైపుణ్యాలు**. వాట్సప్‌ను ఫేస్‌బుక్‌కి అమ్మొద్దంటూ దాని ఫౌండర్ జాన్ కోమ్‌ను కన్విన్స్ చేయడంలో లారీపేజ్‌కి సుందర్ సాయం చేశాడు. సామ్‌సంగ్ మ్యాగజైన్ 'యుఎక్స్' విషయంలో, ఇంకా చాలా విషయాల్లో గూగుల్ బయటివారికి కనీస మాత్రం తెలియనంత ఎక్కువ పనిని సుందర్ గూగుల్ కోసం చేసిపెట్టాడు. ఇంత విస్తృతమైన ట్రాక్

రికార్డు కారణంగానే సుందర్ పలు టెక్నాలజీ దిగ్గజ కంపెనీల దృష్టిని తనవైపు మరల్చుకోగలిగాడు.

ట్విట్టర్ తన ఉత్పత్తుల విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా రమ్మని ఆహ్వానించింది. తదనంతర కాలంలో తనను ట్విట్టర్ సీఈఓగా చేస్తామనీ హామీ ఇచ్చింది. అంతేకాదు, స్టీవ్ బామర్ తరువాత మైక్రోసాఫ్ట్ సీఈఓగా తీసుకోవడానికి కూడా సుందర్ పేరును పరిశీలించారు. (ఆతర్వాత ఆ అవకాశం మరో భారతీయుడు **సత్య నాదెళ్ల**కు దక్కడం మరో గొప్ప విషయం).

గూగుల్‌కి అర్థమైపోయింది. సుందర్‌ను కాపాడుకోవాలంటే తాము చాలా వేగంగా స్పందించక తప్పదని. అదే సమయంలో గూగుల్ హెూల్డింగ్ కంపెనీ 'ఆల్ఫాబెట్ ఇంక్' సిద్ధమవుతోంది. ఆల్ఫాబెట్ కింద వున్న పెద్ద కంపెనీల్లో ఒకటైన గూగుల్‌కి సుందర్ పిచాయ్‌ను సీఈఓగా ప్రకటించింది గూగుల్. అలా ... ప్రపంచపు అతి పెద్ద కంపెనీల్లో ఒకటైన గూగుల్ 'ముఖ్య కార్యనిర్వహణాధికారి'గా అత్యంత కీలకమైన స్థానానికి చేరిపోయాడు సుందర్. అంటే – ఇక ఏమాత్రం వెనక్కి చూసుకోవాల్సిన అవసరం లేని స్థాయికి చేరిపోయాడు.

ఒక సాదాసీదా మదరాసీ కుర్రాడు ఇలా దశలవారీగా తనను తాను పైపైకి మలచుకుంటూ గూగుల్ శిఖరం దాకా చేరాడు. జీవితంలో తానెక్కిన ప్రతి మెట్టునూ తనకి అనువుగా మార్చుకుంటూ, చేసే ప్రతి పనినీ ఇష్టపూర్వకంగా, మనస్ఫూర్వకంగా చేస్తూ ఎదిగాడు. సుందర్ పిచాయ్ వంటి విజయవంతమైన భారతీయులు ఇస్తున్న స్ఫూర్తిని కొత్తతరం యువతీ యువకులు అందుకోవాలని, ఒంటబట్టించుకోవాలని, బలంగా ఎదగాలని కోరుకుందాం.

మద్రాసులో సుందర్ కుటుంబం నివాసం వున్న ఇల్లు ఇదే!




Photo Credit: Ajitha / Cover Asia Press

# విభిన్నతకు పెద్దదిక్కు

**చాలామంది** మనసుల్లో తొలిచే ఒక ప్రశ్న – గూగుల్‌లో ఇన్ని వేలమంది ఉద్యోగులుండగా సుందర్ పిచాయ్‌కే ఇన్ని అవకాశాలెలా వచ్చాయి? అన్ని వేలమంది బృందం మధ్య సుందర్ ఒక్కడూ ఎలా భిన్నమైన వ్యక్తిగా పరిగణ లోకి చేరాడు?

మొదట చాలా తక్కువ ప్రాడక్టులు, ఫీచర్లతో మొదలైన గూగుల్ చాలా వేగంగా ప్రపంచమార్కెట్లోకి దూసుకువెళ్లింది. ఇంటర్‌నెట్ ఆధారంగా పదులకొద్దీ పలు కొత్త ప్రాడక్టులను రూపొందించింది. గూగుల్ ఎక్స్, కేలికో&లైఫ్ సైన్సెస్, నెస్ట్ లాంటి 'ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్' సబ్సిడరీ కంపెనీలను గూగుల్ నిర్వహిస్తోంది. వీటన్నిటినీ ప్రామాణికంగా ఆర్గనైజ్ చేయడానికి వీలుగా 'ఆల్ఫాబెట్ ఇంక్' పేరుతో పేరెంట్ కంపెనీని సృష్టించి, ఆయా విభాగాలను వేర్వేరు వ్యాపార సంస్థలుగా మార్చింది. వీటిలో ఒకటైన గూగుల్ ఇంటర్‌నెట్ ప్రాడక్టుల మీద (ఆండ్రాయిడ్, క్రోమ్, యాప్స్, యూట్యూబ్, మ్యాప్స్ & సెర్చ్) మాత్రమే పనిచేస్తుంది.

ఆల్ఫాబెట్ పేరెంట్ కంపెనీ ఏర్పడ్డాక గూగుల్ కార్యకలాపాలను పర్యవేక్షించడం, కంపెనీని ముందుకు నడిపించడానికి సరైన వ్యక్తుల కోసం మేనేజ్‌మెంట్ చేసిన శోధనలో మొదటి వరుసలో నిలబడ్డవాడు సుందర్ పిచాయ్. కంపెనీలో చాలాకాలంగా ఉద్యోగిగా వుండడం, విశ్వాసపాత్రుడనే నమ్మకం, నాయకత్వ లక్షణాలు, సానుకూలమైన ట్రాక్‌రికార్డు, విశేషమైన అనుభవాన్ని దృష్టిలో వుంచుకుని గూగుల్ సుందర్‌ను తన కొత్త సీఈఓగా ప్రకటించింది. వీటితోపాటు మరికొన్ని కారణాలు కూడా సుందర్‌ను గూగుల్‌లో ఉన్నత స్థానం వైపు నడిపించాయని వ్యాపార నిపుణులు పేర్కొంటారు.

**1) ఆల్‌రౌండర్:** టెక్నాలజీ రంగంలో టాప్ కంపెనీలన్నీ సుందర్‌ని ఆల్‌రౌండర్‌గా గుర్తిస్తాయి. కంపెనీ ప్రాడక్టులకు సంబంధించి అత్యంత సునిశితంగా వ్యవహరిస్తారని సుందర్‌కి మంచి పేరుంది. కొన్ని కంపెనీల సీఈఓలు బాహాటంగానే ... లారీపేజ్ కంటే సుందర్ మెరుగని ప్రకటించారు.

**2) కమ్యూనికేషన్ స్కిల్స్:** తాను చెప్పదలచుకున్న విషయాన్ని అతిస్పష్టంగా చెప్పడంలో సుందర్ దిట్ట. ప్రాజెక్టుల ఆపరేషన్ల గురించి ఉద్యోగులతో సమాచారం పంచుకునేటప్పుడు ... ఆఖరి ఉద్యోగికి కూడా అర్థమయ్యేలా విషయాన్ని వివరిస్తాడని సుందర్‌కి పెద్దపేరుంది. ఈ నైపుణ్యాలతోనే సుందర్ లారీపేజ్‌కి అనేక సమయాల్లో సూచనలిస్తూ, కీలక సమయాల్లో ఎంతో సాయం చేశాడు. ఈ కారణంగానే లారీపేజ్ సన్నిహితుల్లో సుందర్ కూడా ఒకడుగా మారాడు.

3) ఎరిక్ నుంచి గూగుల్ పగ్గాలు చేపట్టిన తరువాత లారీపేజ్ తన 'సెకండ్–ఇన్–కమాండ్'గా సుందర్‌ను ఎంచుకున్నాడు. అనంతరం సుందర్ ఒంటిచేత్తో పలు పెద్ద కార్యాలను చక్కబెట్టాడు. కంపెనీ ఒడిదుడుకుల్లేకుండా స్మూత్‌గా నడవడానికి వీలుగా వైస్ ప్రెసిడెంట్లతో ఒక కోర్‌కమిటీని ఏర్పాటు చేసి లారీపేజ్ మీద ఒత్తిడి తగ్గించగలిగాడు.

4) అప్పటికి ఏడాది కాలంగా సుందర్ గూగుల్ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ & ఇంజనీరింగ్ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తుండడం, మంచి ఫలితాలు సాధించడం కూడా సుందర్‌కి కలిసొచ్చిన అంశం. మూన్‌షూట్ వంటి ప్రాజెక్టుల్లో లారీపేజ్ బిజీగా వున్న సమయంలో ఆ ప్రాజెక్టుకు అవసరమైన 10ఎక్స్ ఇంపాక్ట్ షాట్స్ అన్నిటినీ సుందరే ఏర్పాటు చేసేవాడు.

5) అసాధారణ నైపుణ్యాలు, పట్టుదల, శ్రమించే గుణాలు సుందర్‌ను పలు పోటీ కంపెనీలకు లక్ష్యంగా మార్చాయి. ట్విట్టర్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీలు సుందర్‌ను తమ బోర్డుల్లోకి లాక్కునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశాయి. గత కొన్నేళ్లుగా గూగుల్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో ఇతర కంపెనీల్లో చేరిపోయారు. సుందర్ కూడా వెళ్లిపోతే పరిస్థితులు చేజారతాయని గూగుల్ గ్రహించడం కూడా సుందర్ గూగుల్ సీఈఓ స్థానానికి చేరడానికి దోహదం చేశాయి.

మార్కెట్ అవసరాల్ని దృష్టిలో పెట్టుకుంటూ విభిన్నమైన ఆలోచనలు, కార్యాచరణతో ముందడుగు వేసే ఏ మనిషీ అపజయాలు పొందదు. మొదలుపెట్టిన ప్రతి పనిలో సుందర్ పిచాయ్ విజయం సాధించాడంటే అందుకు కారణం ఇదే!

▶ సుందర్ తన ప్రతి ఆలోచనకీ విలువిచ్చాడు. అది ఎంత చిన్నదైనా, ఎంత పెద్దదైనా, ఆఖరికి దాని ద్వారా వచ్చే ఫలితం ఎంత పరిమితమైనదైనా కూడా ఏనాడూ దాని విలువను తగ్గించిచూడలేదు. 'చిన్న ఆలోచనలే పెద్ద ఫలితాలిస్తాయి' అన్న మాటను రుజువు చేసిచూపాడు.

▶ సుందర్ తన పనితీరును తనకు నచ్చినట్లుగా నడపలేదు. తన టీమ్ పనితీరుకు అనుగుణంగా తాను పనిచేసే శైలిని మార్చుకున్నాడు. ఫలితంగా టీమ్‌లో ప్రతి ఒక్కరూ తమ శైలికి అనుగుణం గానే పని జరుగుతోందని సంతృప్తిపడ్డారు.

▶ సుందర్ తన ప్రాజెక్టుల రూపకల్పనకు కనీసం పదేళ్ల విజన్ పెట్టుకున్నాడు. అంటే, పదేళ్ల తరువాత ప్రపంచానికి ఏ ఉత్పత్తులు అవసరమవుతాయో వాటి గురించి ఈరోజే ఆలోచించడం మొదలుపెట్టాడు. గూగుల్ మ్యాప్స్ అలా పుట్టిందే! నిజానికి గూగుల్ తన ప్రొడక్టుల్లో మ్యాప్స్‌ను చేర్చడానికి తొలుత ఇష్టపడలేదు. పెను ఆర్థికభారం అవుతుందనే కారణంతో వెనుకడుగు వేసింది. కానీ, సుందర్ దానిని ప్రధానమైన టూల్‌గా మార్చడం ద్వారా గూగుల్‌కి ఆదాయం తెచ్చిపెట్టే ప్రధాన వనరుల్లో ఒకటిగా మార్చాడు. 'మన లక్ష్యం సుదూరంలో వున్నా, మన కక్ష్య నుంచే దానిని పూర్తిచేయవచ్చు' అనే సత్యాన్ని సుందర్ రుజువు చేశాడు.

ఇంకా సుందర్ రుజువు చేసిన అనేక విషయాల్ని, పాటించిన గెలుపు సూత్రాల్ని ముందరి పేజీల్లో చదువుదాం. **కష్టే ఫలి.**

# సుందర్ & అంజలి
# ఒక అందమైన ప్రేమకథ

**సుందర** పిచాయ్ గూగుల్ సీఈఓగా ప్రపంచవ్యాప్తంగా పాపులర్. ఎంత కష్టపడి ఆ స్థానానికి చేరగలిగాడో కూడా అందరికీ తెలుసు. విజయాల దారిలో అలుపెరగని ప్రయాణం చేస్తున్న ఈ నిత్య చైతన్యస్ఫూర్తికి ఒక అందమైన ప్రేమకథ వుందని మీకు తెలుసా? జీవితంలో గెలవాలంటే ప్రేమ కూడా ఒక గొప్ప టూల్ అని సుందర్ & అంజలి జంట ఎలా నిరూపించిందో తెలుసుకోవాలనుకుం టున్నారా? అయితే రండి, ఈ ఆసక్తికర కథనం చదివేద్దాం.

సుందర్ చెన్నయ్‌లో ఒక దిగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. సాదాసీదా సదుపాయాలున్న ఇంట్లో ప్రేమాస్పదమైన కుటుంబంతో గడిపాడు. జీవితంలో ఎలాంటి పరిస్థితులనైనా సహనంతో ఎదుర్కోవాలన్న విషయం అతనికి చిన్నతనం లోనే అర్థమైంది. క్రికెట్ మీద ఎంతో మక్కువ వున్నా ఇంట్లో టీవీ లేని కారణంగా స్నేహితుల ఇళ్లలో టీవీ చూడడానికి వెళ్లాల్సివచ్చేది. సిటీబస్సుల్లో ప్రయాణానికి సరిపడా మాత్రమే డబ్బులుండేవి. బలమైన ఆహారం మీద ఆసక్తి వదులుకున్నాడు. వ్యక్తిగత ఇష్టాల్ని కూడా దూరం పెట్టాడు. **'నేర్చుకోవాలి - ఎదగాలి'** అనే సింగిల్ సూత్రాన్ని ఒంటబట్టించుకున్నాడు. ఆ ఫార్ములానే అతన్ని ఐఐటీ ఖరగ్‌పూర్ దాకా నడిపించింది.

అంజలి కూడా మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఒక రాజస్థానీ అమ్మాయి. మెటలర్జికల్ ఇంజనీరింగ్ చదువు కోసం తాను కూడా ఐఐటీ ఖరగ్‌పూర్ చేరింది. సుందరకాండ అక్కడే ప్రారంభ మైంది. సుందర్, అంజలి ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. ఇద్దరి అభిప్రాయాలు, ఆలోచనలు పరస్పరం బలంగా కలుస్తున్నాయని నమ్మకం ఏర్పడింది. ఇక జీవితాన్ని కలిసి నడుపుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఈ నిర్ణయం తీసుకునే సమయానికి వారిద్దరి వయసూ పాతికేళ్ల లోపే. అయితే ఇద్దరూ తమ నిర్ణయాన్ని వెంటనే అమలుపరచాలని భావించలేదు. ప్రేమ కంటే జీవితాన్ని నడిపించే అంశాలు చాలా వున్నాయని వయసుకు మించిన పరిణతితో ఆలోచించారు. అందుకే తమ ప్రేమ విషయాన్ని ఇద్దరూ చాలా రహస్యంగా వుంచారు. ఆఖరికి సుందర్‌కి అత్యంత సన్నిహితులైన మిత్రులకు కూడా ఈ విషయం తెలీదంటే మనకాశ్చర్యం వేస్తుంది.

సుందర్ అదీ ఇదీ అని కాకుండా ఏ సబ్జెక్ట్ మీదయినా ధారాళంగా మాట్లాడేవాడు. నిస్సంకోచంగా తన అభిప్రాయాల్ని అందరితో పంచుకునేవాడు. ఎక్కడా ఎలాంటి తొట్రుపాటు కానీ, తొణుకు కానీ

కనిపించేది కాదు. కానీ, తాను బహిర్గతం చేయదల్చుకోని విషయాల్ని బాగా సన్నిహితులకు కూడా చెప్పేవాడు కాదు. తన మనసులోనే దాచుకునేవాడు. ఈ కారణంగానే ఐఐటీ క్యాంపస్‌లో సుందర్‌కి '**ఘుపా రుస్తుం**' అనే నిక్‌నేమ్ వుండేదని సుందర్ క్లాస్‌మేట్ జోయ్ భట్టాచార్య చెప్పాడు.

దాదాపు రోజూ కలిసే మిత్రులకు కూడా సుందర్, అంజలిల ప్రేమ విషయం తెలియలేదు. 1989లో ఆఖరి సెమిస్టర్ పూర్తయ్యాక తనంతట తాను చెప్పేదాకా వీళ్లిద్దరూ పీకల్లోతు ప్రేమలో మునిగిపోయివున్నారని ఎవరికీ తెలీదు.

ఐఐటీలో చదువు పూర్తికాగానే ఉన్నత చదువుల కోసం సుందర్ అమెరికాకి వెళ్లిపోయాడు. అంజలి ఇక్కడే వుండిపోయింది. టెలిఫోన్ చేయడానికి కూడా ఆర్థిక పరిస్థితులు సహకరించని కారణంగా దాదాపు ఆర్నెల్లపాటు వాళ్లిద్దరూ మాట్లాడుకోలేకపోయారు. ఇవేవీ వారి ప్రేమకు అడ్డంకులుగా మారలేకపోయాయి. సుందర్ ఉద్యోగంలో స్థిరపడగానే ఇద్దరూ పెళ్లిచేసుకున్నారు. కేలిఫోర్నియా లోని లాస్ ఆల్టోస్‌హిల్స్‌లో ఇప్పుడు కుమార్తె కావ్య, కుమారుడు కిరణ్‌తో అన్యోన్యమైన జీవితాన్ని గడుపుతున్నారు.




సుందరాంజలి

# స్ట్రాంగ్ మెమరీ - సుందర్ సూత్రం


**మనిషి** జీవితం మొత్తం అతని ధారణశక్తి మీదే ఆధారపడివుంటుందని అటు యోగులు, ఇటు సైన్స్ నిపుణులు ఒక్కటేమాటగా చెప్తారు. జ్ఞాపకశక్తిని ఎంత పెంపొందించుకుంటే అంత గొప్ప ఫలితాలు లభిస్తాయి. సుందర్ పిచాయ్ జీవితంలో ఈ విషయం ఎన్నోసార్లు రుజువైంది. చిన్నచిన్న విషయాలను కూడా వేగంగా గ్రహించడం, మెదడు పొరల్లో నిక్షిప్తం చేసుకోవడం, అవసరమైన సమయాల్లో నెమరు వేసుకోవడం సుందర్‌కున్న అసాధారణ బలాల్లో ఒకటి.

తమది మధ్యతరగతి కుటుంబమే అయినా, పిల్లల చదువులకయ్యే ఖర్చుల విషయంలో రఘునాథ్[1], లక్ష్మి ఏమాత్రం సంకోచించలేదు. సుందర్, అతని తమ్ముడు శ్రీనివాసన్‌లను మద్రాసు లోని ప్రముఖ విద్యాసంస్థల్లోనే చదివించారు. అశోక్‌నగర్ లోని జవహర్ విద్యాలయలో వాళ్లిద్దరూ పదో తరగతి దాకా చదువుకున్నారు. ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లో వున్న వనవాణి మెట్రిక్యులేషన్ స్కూల్లో ఇంటర్మీడియట్ చదువుకున్నాడు. పాఠశాల రోజుల్లోనే తన అసాధారణ జ్ఞాపకశక్తితో టీచర్లను అబ్బురపరిచేవాడు సుందర్. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ అతని ఎకనామిక్స్ టీచర్ ఉమా ప్రభాకరన్ "సుందర్ 1987లో పదో తరగతిలో వున్నప్పుడే ఇతని భవిష్యత్ అద్భుతంగా వుంటుందని ఊహించాం. చాలా కామ్‌గా, కూల్‌గా తన పని తాను చేసుకుంటూపోయేవాడు. ఎంతటి సంక్లిష్టమైన సబ్జెక్ట్‌నైనా సునాయాసంగా ఒడిసిపట్టుకుని, అంతే బలంగా మనసులో నిక్షిప్తం చేసుకునేవాడు. ఎంత క్లిష్టమైన ఫార్ములాలనైనా జ్ఞాపకం పెట్టుకునేవాడు. అతని కెరియర్ ఇంత స్థాయికి వెళ్లడానికి అతనికున్న నైపుణ్యాలన్నీ ఒక కారణమైతే, అతని జ్ఞాపకశక్తి ఇంకో కారణం" అన్నారు.

ఒక సందర్భంలో సుందర్ గురించి ఆయన స్నేహితుడొకరు ఇలా చెప్పాడు. "సుందర్ ఏ విషయాన్నయినా, ఎంతకాలమైనా జ్ఞాపకం పెట్టుకోగలడు. అలాగే, అవసరం లేదనుకుంటే ఆ విషయాన్ని తన మెమరీ నుంచి పూర్తిగా తొలగించగలడు కూడా!"

గూగుల్ కంటే ముందు సుందర్ చాలా ప్రాజెక్టుల్లో పనిచేసినప్పటికీ, గూగుల్ ప్రాజెక్టులు అతని జ్ఞాపకశక్తి సామర్థ్యానికి సవాల్‌గా నిలబడ్డాయి. గూగుల్ టూల్‌బార్ తయారీ మొదలుకుని ప్రతి విషయంలో అతని అసాధారణ జ్ఞాపకశక్తే గూగుల్ ప్రాజెక్టులను విజయవంతంగా మార్చింది. ఆండ్రాయిడ్ ప్రాజెక్టును తన చేతుల్లోకి తీసుకుని 'ఆండ్రాయిడ్ వన్' అని మార్చగానే కొన్ని

[1] **రఘునాథ్ :** ఇంగ్లీష్ స్పెల్లింగ్‌లో Regunath అని వుంటుంది. కానీ పలికేతీరుకు అనుగుణంగా తెలుగులో రఘునాథ్ అవుతుంది.



నెలలపాటు అతని బృందం నిర్విరామంగా పనిచేసింది. టీమ్‌వర్క్ విషయంలో మహానేర్పరి అయిన సుందర్ ... తాను ఎవరికి ఏ టాస్క్ అప్పజెప్పాను, ఎవరు ఎవరితో కోఆర్డినేట్ చేసుకోవాలి? లాజిక్స్, కోడ్‌వర్క్, ఇంకా పలు విషయాల్లో ఏ సమయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నాం; వాటినెలా అమలు చేశాం వంటి వందలాది విషయాలను మనసులో చెదిరిపోకుండా గుర్తుపెట్టుకునేవాడు. ఫలితంగా సుందర్ ఇన్‌వాల్వ్ అయివున్న ప్రాజెక్టులన్నీ ఎలాంటి ఒడిదుడుకుల్లేకుండా ముందుకు నడుస్తుంటాయి. సుందర్ ప్రాజెక్టులన్నీ డెడ్‌లైన్ లోపే పూర్తి కావడానికి కూడా అతని జ్ఞాపకశక్తే కారణం. ఇక ఫోన్ నెంబర్లయితే లెక్క చెప్పాల్సిన అవసరం లేదు. ఎక్స్‌టెన్షన్ నెంబర్లతో సహా గుర్తుపెట్టుకోవడంలో అతనికి అతనే సాటి అని గూగుల్‌తో సహా అతను పనిచేసిన ప్రతిచోటా అతని సహోద్యోగులు విభ్రమంగా చెప్తారు. రోజూ ఉదయం లేవగానే ముందురోజు దాకా జరిగిన పనిని సమగ్రంగా సమీక్షించుకోవడం సుందర్ అలవాటు.

**తన జ్ఞాపకశక్తి గురించి ఒక మీడియా ఏజెన్సీతో మాట్లాడుతూ సుందర్ ఏమన్నాడంటే ...**

“నాకు మొదట్నుంచీ జ్ఞాపకశక్తి ఎక్కువే. కానీ, దేన్నయినా ప్రాధాన్యతల వారీగా గుర్తుపెట్టుకుంటాను. ఈ విషయం మనసులో ముద్రించుకోవాల్సిన అవసరం వుంది అని నాకనిపిస్తే దాన్నలా మనసులో నిక్షిప్తం చేసుకుంటాను. అవసరం లేని విషయాలను మనసులో పెట్టుకోను. కొన్ని సందర్భాల్లో తాత్కాలికంగా గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఏర్పడినా, ఎప్పటికప్పుడు వాటిని తొలగిస్తుంటాను. ఫలితంగా ఎప్పటికప్పుడు కొత్త విషయాలు దాచుకోవడానికి మెదడులో కొత్త స్పేస్ ఏర్పడుతుంటుంది”.

# భాష బలమైన ఆయుధం

**భారత** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న 'మేకిన్ ఇండియా' ప్రాజెక్టులో గూగుల్‌కి భాగస్వామ్యం వుంది. సుందర్ పిచాయ్ గూగుల్ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన కొన్ని నెలలకే భారత పర్యటనకు వచ్చాడు. గూగుల్‌ను విశ్వవ్యాపితం చేయాలంటే తన ప్రతి టూల్‌కి, ప్రతి ఫీచర్‌కీ స్థానిక భాషలను అనుసంధానం చేయడం ద్వారా మాత్రమే సాధ్యమని సుందర్ భావించాడు. 2014 తర్వాత ప్రపంచ మార్కెట్లో గూగుల్ వేగం పెరగడానికి కారణం పలు ప్రపంచ భాషల్లో తమ టూల్స్‌ను ఉపయోగించుకునే సదుపాయం ఏర్పడడమే. ఈ డెవలప్‌మెంట్‌లో సుందర్ పోషించిన కీలక పాత్ర ఇప్పుడు భారతీయులకు అనేక విధాలుగా ఉపకరిస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా ఎంత గొప్ప సాంకేతిక పరిజ్ఞానం అందుబాటు లోకి వచ్చినా, అది ప్రాంతీయ భాషలతో అనుసంధానం కాకుండా దాని ప్రయోజనం పరిమితమే అవుతుందని సుందర్ గూగుల్ ప్రాజెక్టుల్లో చేరిన తొలినాళ్లలోనే గమనించాడు. తమ ప్రతి ఫీచర్‌నూ ప్రపంచవ్యాప్తంగా పదుల కోట్ల మంది ఉపయోగిస్తారు కాబట్టి, స్థానిక భాషల్ని గూగుల్ ఫీచర్లన్నిటికీ జత చేయడం వల్ల ... మధ్యతరగతి వినియోగదారులకు విస్తృతంగా చేరడానికి అవకాశం వుంటుందని, తద్వారా వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకువెళ్లవచ్చని సుందర్ నమ్మాడు. ఈ నేపథ్యంలో నుంచి పుట్టుకొచ్చిందే 'ఇండిక్ టూల్స్'. ఈ టూల్ నిర్మాణంలో సుందర్ బృందం కఠోర కృషి చేసింది.

గూగుల్ ఇండిక్‌టూల్స్‌ను ఆవిష్కరించడం ద్వారా సుందర్ బృందం భారతీయ భాషల్ని సాంకేతికంగా ఒక్క గొడుగు కిందికి తీసుకొచ్చినట్లయింది. ఈరోజు జీమెయిల్, మ్యాప్స్‌తో సహా గూగుల్ ఫీచర్లు అన్నిటినీ మనం మన మాతృభాష తెలుగులో ఉపయోగించుకోవడానికి, తెలుగులో నేరుగా టైప్ చేసుకోవడానికి 'గూగుల్ ఇండిక్ టూల్స్' బాగా పనికొస్తోంది. దేశవ్యాప్తంగా యూనివర్సిటీలు మొదలుకుని చిన్న పాఠశాలల దాకా తమ ప్రాంతీయ భాషల్లో డాక్యుమెంట్ల తయారీకి గూగుల్ ఇండిక్ టూల్స్‌నే ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మేకిన్ ఇండియా' ప్రాజెక్టులో కూడా దాదాపు అన్ని ప్రాంతీయ అవసరాలకూ ఇండిక్ టూల్స్‌నే వినియోగిస్తున్నారు.

'ప్రాజెక్ట్ లూన్' ద్వారా గూగుల్ భారత్ లోని కుగ్రామాలకు సైతం వేగవంతమైన ఇంటర్‌నెట్ సదుపాయం అందించే పనిలో వుంది. తక్కువ బాండ్‌విడ్త్‌తో, ఆఫ్‌లైన్‌లో కూడా ఇంటర్‌నెట్ అందించడం ద్వారా సాంకేతికతను మరింత విస్తృతం చేయబోతున్నామని గూగుల్ ప్రతినిధిగా సుందర్ ప్రకటన చేశారు. పల్లెలకు సైతం స్పీడ్ ఇంటర్‌నెట్ అందుబాటు లోకి వస్తే ... అది భారత్ లోని




చిన్న, మధ్యతరగతి వ్యాపారులకు వరంగా మారుతుంది. ఫలితంగా చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని కంపెనీలకూ అవకాశాలు పెరుగుతాయి. ముఖ్యంగా మహిళా ఔత్సాహిక వ్యాపారులకు ఎక్కువ ప్రయోజనాలు దక్కుతాయి. రాబోయే కొన్నేళ్లలో 5 కోట్ల మంది మహిళలు, 2 కోట్ల వ్యాపారాలు పూర్తిగా ఇంటర్‌నెట్ పరిధిలోకి వస్తాయి. ఇవన్నీ సంపద సృష్టించడం, కొత్త రంగాల్లో పెట్టుబడులు పెట్టడం, ఆర్థికంగా బలపడడానికి భారతీయులకు ఎంతో సహకరిస్తాయి. పాల వ్యాపారం చేసుకునే పాడి రైతుల నుంచి, సర్వీస్ రంగంలో పనిచేసేవారిదాకా అందరికీ ఉపయోగపడే టూల్స్‌ను పెద్ద సంఖ్యలో తయారుచేసే పనిలో గూగుల్ వుంది. వీటన్నిటినీ భారతీయ భాషలకు అనుసంధానం చేయడం ద్వారా భారతీయులకు ప్రయోజనాలు దక్కేందుకు కృషిచేస్తానని సుందర్ సిలికాన్ వ్యాలీ నుంచే ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే 'గూగుల్ టెజ్' వంటి యాప్స్‌ను కూడా గూగుల్ విడుదల చేసింది. సులభంగా. నమ్మకంగా డబ్బు బదిలీ చేయడానికి పనికొచ్చే ఈ యాప్ తయారీలో కూడా సుందర్‌దే కీలక భాగస్వామ్యం. ఇందులో కూడా భారత ప్రభుత్వం గుర్తించిన 22 అధికారిక భాషల్లో యాప్‌ను ఉపయోగించుకునే సౌలభ్యం ఏర్పాటైంది.

ఇప్పటికే ఇండియాలో కోటీ ఇరవై లక్షల మంది ప్రజలకు గూగుల్ టూల్స్ కనెక్ట్ అయివున్నాయని, వీటి ప్రయోజనాల్ని అందరికీ అందుబాటు లోకి తీసుకువస్తామని సుందర్ ప్రకటించాడు. భారతీయ చిన్న వ్యాపారుల కోసం తక్కువ ధరలో లభించే క్రోమ్‌బుక్స్ (ల్యాప్‌టాప్)ను గూగుల్ విడుదల చేసింది. క్రోమ్‌బుక్స్ ప్రాజెక్టు కూడా సుందర్ ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిందే. గూగుల్ ఇప్పటికే దేశంలోని ప్రధాన రైల్వేస్టేషన్లన్నిటిలో వైఫై ద్వారా ఉచిత ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించింది. ఇది ప్రయాణీకులతో పాటు, రవాణా రంగానికి కూడా కీలకంగా ఉపయోగపడనుంది.

30 డాలర్లలో (సుమారుగా 2000 రూపాయలు) అన్ని ప్రాంతీయ భాషలనూ సపోర్ట్ చేసే ఫీచర్ ఫోన్‌ను భారతీయ మార్కెట్లో ప్రవేశపెట్టగలిగితే దేశంలో మధ్యతరగతి ప్రజల వ్యాపారమంతా దానిమీదే జరుగుతుందని సుందర్ ఒక సమావేశంలో చెప్పాడు.

మన అవసరాలు మన మాతృభాష సాయంతో తీరితే అంతకంటే ఇంకేం కావాలి? మధ్య, దిగువ తరగతి జనాభా ఎక్కువగా వుండే మనదేశానికి సుందర్ లాంటి సాంకేతిక నిపుణుల సాయం ఎంతో అవసరం. భాషను కీలకంగా గుర్తించడం సుందర్ వ్యాపార విజయాలకు ఒక కారణమని మీకూ అర్థమైంది కదా!

# సుందర్ పిచాయ్ - 12 సక్సెస్ సూత్రాలు

**2004లో** గూగుల్‌లో చేరిన నాటినుంచీ దాదాపు దశాబ్దకాలం సుందర్ పిచాయ్ ఎవరో బయటి ప్రపంచానికి పెద్దగా తెలీదు. ఎప్పుడైతే గూగుల్ తన హెూల్డింగ్ కంపెనీ ఆల్ఫాబెట్‌ను ప్రారంభించి, సుందర్‌ను గూగుల్ సీఈఓగా నియమించుకుందో – ఆ రాత్రికి రాత్రే సుందర్ ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో వ్యక్తిగా మారిపోయాడు. అసలు గూగుల్ సీఈఓ రేసులో కూడా లేని సుందర్ అనూహ్యంగా తెరపైకి వచ్చి అధినేతగా మారిపోయాడు. నిజానికి ఇవన్నీ బయటి ప్రపంచానికి ఊహించలేని పరిణామాలే కావచ్చు కానీ, గూగుల్ లోపల మాత్రం చాలామందికి తెలుసు – సుందర్ భవిష్యత్తులో గూగుల్‌ను తన నీడ కిందికి తెచ్చుకోబోతున్నాడని; సుందర్ లేని గూగుల్‌ను ఊహించలేమని. అంతిమంగా అదే జరిగింది. సుందర్ గూగుల్ వ్యవహారాలన్నీ చక్కబెట్టే 'అధినేత' స్థానానికి చేరాడు.

సుందర్ విజయాల గురించి ఆలోచించేవారికి మనసులో చాలా ప్రశ్నలు ఎదురవుతుంటాయి. సుందర్ పిచాయ్ పట్టుకున్నదల్లా ఎందుకు బంగారమైపోయింది? తన చేతుల్లోకి తీసుకున్న ప్రతి



ప్రాజెక్టూ ఎలా సక్సెస్ అయింది? ఇన్ని పెద్ద ప్రాజెక్టుల్ని ఒంటిచేత్తో ఎలా నిలబెట్టగలిగాడు? ఈరోజు ప్రపంచం లోనే నెంబర్‌వన్ కంపెనీగా గూగుల్‌ని ఎలా తీర్చిదిద్దగలిగాడు? ఏ శక్తులు అతని విజయా లకు కారణమయ్యాయి? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం ఒక్కటే. అతడి కఠోర శ్రమ. సుందర్ వెనుక ఎలాంటి అతీతశక్తులూ లేవు. అతని శ్రమ, సాధించిన విజయాలే అతన్ని గూగుల్ అనే అత్యున్నత శిఖరానికి చేర్చాయి.

సుందర్ పిచాయ్ విజయాలకు ఆలంబనగా నిలిచిన అంశాల గురించి ఒకసారి పరిశీలిస్తే ... 12 కారణాలు స్పష్టంగా కనపడతాయి. ఆ 12 కారణాలనీ ఈ వ్యాసంలో 12 అంశాలుగా చూద్దాం.

## 1) కొత్త విషయాల్ని నేర్చుకోవడం

మనిషి ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకుంటూపోతేనే భవిష్యత్ లోకి లాభకరంగా వెళ్లగలుగు తాడు. సుందర్ విద్యార్థి రోజుల నుంచీ కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపేవాడు. అది సబ్జెక్టులకు సంబంధించింది కావచ్చు, కాకపోవచ్చు. కానీ, తనకు ఆసక్తికరంగా అనిపించిన ప్రతి అంశం గురించీ కాస్త లోతుగానే తెలుసుకునే ప్రయత్నం చేసేవాడు. మద్రాసు వీధుల గురించి, తన స్కూల్లోని సైన్స్ ల్యాబ్ గురించి, తన చుట్టూ వున్న మనుషుల గురించీ, ప్రపంచంలో జరుగుతున్న తాజా పరిణామాల గురించీ, పత్రికల్లో వార్తల గురించీ ... ఇలా ప్రతి కొత్త విషయాన్నీ క్లుప్తంగానైనా తెలుసుకునే ప్రయత్నం చేసేవాడతను. సైన్స్, గణితం సబ్జెక్టుల్లో తనకంటే పై తరగతుల పుస్తకాలు పరిశీలించడం, ఆ క్లాసుల విద్యార్థుల నుంచి విషయ పరిజ్ఞానం పొందడం మీద సుందర్ మంచి ఆసక్తిని ప్రదర్శించేవాడని అతని టీచర్ ఒకరు చెప్పారు. తనకు తెలిసిన విషయాలకు మాత్రమే పరిమితమవుతూ, కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపనివారికి విజయం దక్కదని సుందర్ సూత్రం-1 చెప్తోంది.

## 2) స్థిమితత్వం

గొప్పగొప్ప విజయాలు సాకారం కావాలంటే మానసికంగా స్థిరంగా వుండడం అవసరం. సుందర్ జీవితం కూడా ఈ సత్యాన్నే రుజువు చేస్తోంది. సుందర్ ఏ పని తలపెట్టినా చాలా స్థిమితంగా ఆలోచిస్తాడు. హడావుడి పడడం, ఒత్తిడి పెట్టుకోవడం వంటివేవీ వుండవు. ఎంత పెద్ద ఆలోచనైనా, ఎంత పెద్ద పనినైనా చాలా కూల్‌గా నిర్వహించడం సుందర్‌కి అలవాటు. స్కూలు రోజుల్నుంచీ సుందర్ తన హోమ్‌వర్క్ పూర్తి చేయడం, క్లాస్‌నోట్సు సిద్ధం చేసుకోవడం వంటి పనుల్లో కూడా చాలా స్థిమితంగా వ్యవహరించేవాడని, పూర్తి ధ్యానంతో వ్యవహరించేవాడని సుందర్ తండ్రి రఘునాథ్ ఒక విలేకరికి చెప్పారట. గూగుల్ లాంటి గ్లోబల్ కంపెనీలో కొన్ని వేలమంది ఉద్యోగుల్ని, బయటి ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం, వ్యవహారాలు చక్కబెట్టాలంటే ఎంత స్థిమితంగా వ్యవహరించే నేర్పు కావాలి? ఆ నైపుణ్యం వుంది కాబట్టే సుందర్ ఆ స్థాయికి చేరగలిగాడు. మానసికంగా బలంగా వున్నవాడు ఎలాంటి ఎత్తులనైనా అవలీలగా ఎక్కగలుగుతాడని సుందర్ జీవితం విస్పష్టం చేస్తోంది.

## 3) అంశాల మధ్య పొంతన కుదుర్చుకోవడం

సుందర్ కెరియర్‌ను జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక విషయం అర్థమవుతుంది. గూగుల్ టూల్‌బార్, గూగుల్ క్రోమ్, ఆండ్రాయిడ్ వన్, ఇండిక్ టూల్ – ఇలా పలు టూల్స్ మీద ఏకకాలంలో పనిచేస్తూ కూడా సుందర్ ఎక్కడా పట్టు తప్పలేదు; తన బృందాన్ని పట్టు తప్పనివ్వలేదు. వేర్వేరు బృందాలు, వేర్వేరు టెక్నాలజీల సాయంతో పనిచేస్తున్నప్పటికీ ఎక్కడా తొట్రుపాటు పడకుండా అన్ని పనులూ పూర్తి చేయగలిగారు. ఇందుకు కారణం – సుందర్ తాను పనిచేస్తున్న ప్రతి అంశానికీ ఇతర అంశాలతో పొంతన కుదుర్చుకోగలగడం. ఏ ఫీచర్ ఎందుకోసం తయారవుతోంది, ఎలా తయారవుతోంది మొదలైన విషయాలపై పూర్తి స్పష్టత వుండడం వల్ల సుందర్ అన్ని అంశాల మధ్యా సరైన కనెక్టివిటీని సాధించగలిగాడు. దీనిని మీరు ససాక్ష్యంగా పరిశీలించాలనుకుంటే ... రెండు గూగుల్ టూల్స్‌ను తీసుకోండి. రెండిటి ఫీచర్లనూ దేనికది రాసుకోండి. రెంటి ప్రయోజనాల్నీ నోట్ చేయండి. అంతిమంగా ఆ రెండు టూల్స్ మధ్యా వున్న కనెక్టివిటీ మీకు సింపుల్‌గా అర్థమైపోతుంది. ఈ అనుసంధానం అంత సులభంగా సాధించగల విద్య కాదు. ఈ నైపుణ్యమే సుందర్ విజయాలకు ప్రధాన హేతువుల్లో ఒకటిగా నిలబడింది.

## 4) జ్ఞాపకశక్తి

సుందర్ సాధించిన విజయాలకు ప్రధాన కారణం అతని జ్ఞాపకశక్తే. తన ఒక్కడి చేతుల కింద ఏక కాలంలో అనేక ప్రాజెక్టుల నిర్వహణ జరిగే చోట ... ఎక్కడా తడబాటు లేకుండా, ప్రతి ప్రాజెక్టునూ విజయవంతంగా మార్చగలుగుతున్నాడంటే అందుకు కారణం సుందర్ జ్ఞాపకశక్తేనని చెప్పుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా సుందర్ బృందాల్లో పనిచేస్తున్నవారి సంఖ్య కనీసం మూడువేలకు పైమాటే. ఇందరిమధ్య వ్యవహారాల్ని చక్కదిద్దుకోవాలంటే అంత హైఎండ్ మెమరీ లేకుండా సాధ్యం కాదు.

## 5) కలవడం – కలుపుకుపోవడం

ప్రాజెక్టులు సక్సెస్ కావడానికి ఉద్యోగుల నైపుణ్యాలు కలిస్తే చాలదు, వారి మనస్తత్వాలూ, పనితీర్లూ కూడా కలవాలి. ఆ కలవడం కూడా ఆషామాషీగా కాదు, చాలా బలంగా కలవాలి. అలా కలవాలంటే ఆ కలిపేవాడు అత్యంత బలవంతుడైవుండాలి. సుందర్ శారీరకంగా బలమైనవాడు కాకపోవచ్చు కానీ, నలుగురితో కలవడం, వారిని కలుపుకుపోవడం, అన్నివైపుల నుంచీ ప్రయోజనాల్ని సాధించడంలో మాత్రం మాస్టర్. ఎన్నో సందర్భాల్లో ఇది రుజువైంది. సుందర్‌కి తాను పనిచేస్తున్న ప్రతి ప్రాజెక్టులో వున్న సభ్యులందరూ తెలుసు. వారందరి పనితీర్ల మీద అతనికి స్పష్టమైన అవగాహన వుంది. ఏ పని ఎవరితో ఎలా చేయించుకుంటే సరైన ఫలితం లభిస్తుందో అతనికి ఖచ్చితమైన అంచనా వుంది. అంశాలవారీగా అందరినీ కలుపుకుపోవడం, అందరి ఆలోచనలకీ విలువనివ్వడం, అంతిమంగా ఒక మార్గాన్ని నిర్దేశించుకోవడం, ఆ దారిలో ముందుకు వెళ్లడం సుందర్ సక్సెస్ ఫార్ములాల్లో కీలకమైనది. చిన్నస్థాయి ఉద్యోగుల నుంచీ కార్పోరేట్ మార్కెటింగ్ బృందాల దాకా





అందరితోటీ సత్సంబంధాలను ఏర్పరచుకోవడం వల్ల ... అవసరాలకు తగినట్లు వ్యూహాల్ని రచించుకో వడం, వ్యవహారాల్ని చక్కబెట్టుకోవడంలో సుందర్ ఎప్పుడూ సక్సెస్ సాధిస్తూనే వస్తున్నాడు.

## 6) అవసరాల్ని మెరుగ్గా గుర్తించడం

ఒక ప్రపంచస్థాయి ప్రొడక్ట్ కంపెనీకి సీఈఓ స్థానం దాకా చేరడానికి సుందర్‌కి సహకరించిన మరో ముఖ్యమైన అంశం – మార్కెట్ అవసరాల్ని మెరుగ్గా గుర్తించడం. 'నాకేం తెలుసు' అనే దృష్టి కంటే 'జనానికి ఏం కావాలి?' అనే ప్రశ్నే ఏ వ్యాపారాన్నయినా ముందుకు నడిపిస్తుంది. సుందర్ ఈ విషయంలో ఎంతో దార్శనికంగా వ్యవహరిస్తుంటాడు. గూగుల్‌లో ఈరోజు అందుబాటులో వున్న అనేక ఫీచర్లను రూపొందించడంలో సుందర్‌కి కీలక భాగస్వామ్యం వుంది. ప్రాంతీయ భాషల్ని ఇంటిగ్రేట్ చేస్తే తమ టూల్స్‌కి ఎక్కువ ప్రయోజనం వుంటుందన్న విశ్వాసం అతడిని 'ఇండిక్ టూల్స్' తయారీ దిశగా ప్రేరేపించింది. మధ్యతరగతి ప్రజలెక్కువగా నివసించే ఇండియా లాంటి దేశాల్లో ఇంటర్‌నెట్ ఇంకా సులభంగా, చౌకగా లభిస్తే గూగుల్ మరింత విస్తరిస్తుందన్న ముందుచూపే అతడిని 'ప్రాజెక్ట్ లూన్' వైపు నడిపించింది. కుగ్రామాల్లో వుండే ప్రజలు సైతం సులభంగా డబ్బు విషయాలు చక్కబెట్టుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందన్న విజనరీ ఆలోచనే 'టెజ్' యాప్‌ను సృష్టించ డానికి దోహదం చేసింది. ఎప్పటికప్పుడు తాజాగా తన వినియోగదారులకు ఏం కావాలో తెలుసుకోవ డానికి నిరంతర కృషి చేస్తూనేవుంటాడు కాబట్టే ... సుందర్ ప్రపంచ ప్రఖ్యాత ఆలోచనాపరుల్లో ఒకడిగా మారగలిగాడు.

## 7) అవకాశాల్ని అన్వేషించడం

అవసరాలు, అవకాశాలు రెండూ ఇంటర్–కనెక్టెడ్ పదాలు. అవసరం వుంది అంటే అవకాశం వున్నట్టే. అవకాశం వుంది అంటే అది తీర్చాల్సిన అవసరం కింద లెక్క. సుందర్ పిచాయ్ తొలినుంచీ అవసరాలను ఎంతగా దృష్టిలో పెట్టుకున్నాడో, వాటిని తీర్చడానికి వున్న అవకాశాల్ని కూడా అంతే దృష్టిలో పెట్టుకున్నాడు. తన కంపెనీ మరింతగా ఎదగడానికి, విస్తరించడానికి ఎక్కడెక్కడ ఎలాంటి అవకాశాలున్నాయో తెలుసుకోవడానికి నిరంతరం శోధిస్తూనేవుండే సాంకేతిక నిపుణుడు సుందర్. విస్తరించేకొద్దీ తన పరిధిని మరింత విశాలపరచుకుంటూ వెళ్లే గూగుల్ అతని అన్వేషణ శక్తికి సరిగ్గా సరిపోయింది. 'ఎక్కడ వెలుగు ప్రసరిస్తూవుంటుందో నీ చూపు అక్కడ వుండాలి, నీ ప్రయాణం అక్కడికి సాగాలి.' సుందర్ ఈ సూత్రాన్ని మనసావాచా నమ్మాడు. ఒకదానివెంట మరొకటి వెలుగురేఖలను వెతుక్కుంటూ ప్రయాణం చేశాడు. ఫలితంగా ఈరోజు మానవజాతి వికాసానికి అవసరమైన ఎన్నో సదుపాయాలు ఏర్పడడానికి దోహదమయ్యాడు.

## 8) గ్లోబల్ ఆలోచనలు

'స్థానికంగా ఆలోచించు, విశ్వవ్యాప్తంగా పనిచెయ్' ( Think Local – Act Global) అనే గాంధీ సూత్రం ఒకటుంది. ఈరోజున్న ప్రపంచీకరణ పరిస్థితుల్లో ఏ ప్రొడక్ట్‌కైనా సాధ్యమైనంత విస్తృత

పరిధి వుంచుకోవడం అవసరం. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఏ అవసరం వున్నా, దానిని తీర్చే టూల్ ఆ ప్రాంతంలోనే తయారు కావాలన్న రూలేమీ లేదు. అలాగే, మనం రూపొందించే ప్రొడక్టు ప్రపంచం మొత్తానికీ పనికొచ్చేది కావచ్చు. సుందర్ పిచాయ్ ఈ సూత్రాన్ని బాగా ఒంటబట్టించుకున్నాడు. గూగుల్ నుంచి తయారయ్యే ప్రొడక్టులన్నీ ప్రపంచంలో ఎక్కడైనా మార్కెట్ చేసుకోవడానికి అనువుగా తీర్చిదిద్దడం మొదలు పెట్టాడు. జీమెయిల్‌తో సహా గూగుల్ ప్రతి యాప్‌నీ భూమ్మీద ఎక్కడైనా ఉపయోగించుకునే అవకాశం ఏర్పడడం ఇందులో భాగమే!

మన ఆలోచన పరిధుల్ని ఎంతగా పెంచుకుంటే మార్కెట్ పరిధి అంతగా పెరుగుతుంది. కలామ్ వంటి నిపుణులు చెప్పింది కూడా అదే. బిగ్ పిక్చర్ ఊహించడం, దానిని సాకారం చేసుకోవడానికి ఉన్నతంగా కృషి చేయడం. సుందర్ విజయాలకు కారణాల్లో విశ్వదృష్టితో ఆలోచించడమూ ఒకటి.

## 9) పోటీని ఊహించడం – పోటీని సృష్టించడం

విశ్వవిపణిలో ఎవరెస్టు ఎత్తున నిలబడిన ఒక కంపెనీకి సీఈఓగా వుండే వ్యక్తి ... తన కంపెనీని ఆ స్థానం నుంచి దించడానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతాయని ఊహించగలడు. కానీ వాటిని ఎదుర్కోలేకపోతే ఎవరెస్టంత చరిత్ర కూడా మంచులా కరిగిపోతుందనీ అతనికి తెలిసివుండాలి. సుందర్‌కి ఇది బాగా తెలుసు. కాబట్టే, పోటీకి తట్టుకునేలా ఎప్పటికప్పుడు తనను, కంపెనీని మలచు కుంటూనే వుంటాడు. ఒకవిధంగా చెప్పాలంటే నిరంతరం యుద్ధం చేస్తూనేవుంటాడు.

పోటీని ఊహించడం, దానిని ఎదుర్కోవడం ఒక ఎత్తయితే, సుందర్‌కి ఇంకో ప్రత్యేకత వుంది – పోటీని సృష్టించడం. ఇంటర్‌నెట్ ఎక్స్‌ప్లోరర్, మొజిల్లా ఫైర్‌ఫాక్స్‌లకు పోటీగా గూగుల్ టూల్‌బార్‌నీ, ఆతర్వాత క్రోమ్ బ్రౌజర్‌నీ సృష్టించిన పిచాయ్ మెజారిటీ ఇంటర్‌నెట్ యూజర్లను క్రోమ్ వైపుకు తిప్పగలిగాడు. అదే సమయంలో క్రోమ్‌కు సవాళ్లను ఎదుర్కొనే శక్తిని కూడా కల్పించాడు. ఇంటర్‌నెట్ ఎక్స్‌ప్లోరర్, మొజిల్లా ఫైర్‌ఫాక్స్‌లు అందుకోలేనంత వేగంగా క్రోమ్‌లో కొత్త ఫీచర్లను జోడించడం ప్రారంభించాడు. మార్కెట్లో క్రోమ్‌కి పోటీ అంటే క్రోమ్ మాత్రమే అనేవిధంగా దానిని నిలబెట్టాడు. క్రోమ్ బ్రౌజర్ వచ్చాక ఇంటర్‌నెట్ ఎక్స్‌ప్లోరర్‌ను మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ఎంత అభివృద్ధి చేసినా క్రోమ్‌ను చేరుకోలేకపోయింది. ఫైర్‌ఫాక్స్ కాస్త గట్టిపోటీనే ఇస్తున్నప్పటికీ, అది ఓపెన్‌సోర్స్ కావడం, ప్రొప్రయిటరీ మార్కెట్ మీద ఆధారపడింది కాకపోవడంతో క్రోమ్‌కి మొజిల్లాతో పోటీ అవసరమే లేకుండాపోయింది. సవాళ్లను, పోటీని ఎదుర్కోవడమే కాదు, మనకి మనమే పోటీగా నిలబడగల శక్తిని పెంపొందించుకోవడం నాయకత్వ లక్షణాల్లో ముఖ్యమైనదని సుందర్ సూత్రం–9 రుజువు చేసింది కదా!

## 10) పరిమితులు విధించుకోవడం

పని విషయాల్లో అపరిమితంగా కృషిచేసే సుందర్ పిచాయ్ ... అనేక స్వీయ పరిమితులను విధిం చుకుని వ్యవహరిస్తాడంటే బహుశా మీరు నమ్మలేరేమో! కానీ ఇది నిజం. స్నేహసంబంధాలు

కొనసాగించడంలో, బాధ్యతలు అప్పగించడం, పంచుకోవడంలో సుందర్ చాలా జాగ్రత్తగా, ఆచితూచి వ్యవహరిస్తాడని బిజినెస్ గ్రూపుల్లో బలంగా చెప్పుకుంటారు. అవసరానికి మించి మాట్లాడకపోవడం, మాట్లాడే ప్రతి మాటనీ జాగ్రత్తగా మాట్లాడడం, వ్యాపార ఆలోచనల్ని కూడా పరిమితుల్లోనే పంచుకోవడం, కంపెనీ రహస్యాలను కాపాడడం వంటి అనేక నాయకత్వ లక్షణాలు సుందర్‌లో కనిపిస్తాయి. తన ఆధ్వర్యంలో నడిచే ప్రాజెక్టుల్లో పనిచేసేవారితో సుందర్ చాలా ఆత్మీయంగా మెలుగుతారని, కానీ ఒక పరిమితికి మించి సంబంధాలను వుంచరనీ అతనికి పేరుంది. బయట వ్యాపారవర్గాల్లోనూ అంతే. "ఆలోచనల్ని అపరిమితంగా రానివ్వు; ఆచరణలో పరిమితులు విధించుకో" అనే సత్యాన్ని సుందర్ పిచాయ్ స్పష్టంగా చెప్తున్నారు.

## 11) సమయపాలనలో సముద్రం లాగే!

కాలం – ఒక్కసారి గడిచిపోతే మళ్లీ వెనక్కిరాదు. ముందుకు నడుస్తూపోవడమే జీవితం. టైమ్ మేనేజ్‌మెంట్ విషయంలో సుందర్ చాలా పర్‌ఫెక్ట్. గూగుల్‌లో సాధారణ ఉద్యోగిగా వున్నప్పటినుంచీ తన నిర్వహణలో వున్న ప్రతి ప్రాజెక్టునూ సమయానికి పూర్తిచేయడం, అనుకున్న టైమ్‌కి మార్కెట్‌కి దానిని విడుదల చేయడంలో సుందర్‌కి మేటి పేరుంది. గూగుల్ సీఈఓగా ఎదిగిన తర్వాత ... ఇప్పుడు కంపెనీ ప్రాజెక్టులన్నిటి మీదా దృష్టిపెట్టాల్సిన బాధ్యత అతనిపై పడింది. పని భారం విపరీతంగా పెరిగిపోయింది. అయినాకూడా, తన సమయపాలన విషయంలో ఎక్కడా సుందర్ రాజీపడలేదు. కాబట్టే ... గూగుల్ ప్రాడక్టుల విడుదల విషయంలో పెద్దగా ఆలస్యాలుండవు.

## 12) అంతర్జాతీయ ఆర్థిక దృష్టి

అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలు చేసే గ్లోబల్ కంపెనీలన్నీ 'మారకం రేటు' ఆధారంగా ఆయా దేశాల్లో తమ వ్యాపారాల్ని బలోపేతం చేసుకుంటాయి. గూగుల్ అధినేతగా సుందర్ ఈ విషయాన్ని మరింత లోతుగా అర్థం చేసుకున్నాడు. గూగుల్ మ్యాప్స్ సృష్టికర్తల్లో ఒకరిగా సుందర్ జాగ్రఫికల్‌గా ప్రపంచం మీద ఎంత పట్టు సాధించాడో, ఆయా దేశాల ఆర్థిక స్థితిగతుల మీద కూడా అంతే పట్టు సాధించాడు. గూగుల్ ప్రాడక్టులను విక్రయించడంలో, గూగుల్ సేవలకు ధరల్ని నిర్ణయించడంలో ఆయా దేశ ఆర్థిక వ్యవస్థలకు అనువైన మార్గాల్ని రూపొందించాడు. ఫలితంగా ఇతర కంపెనీలతో పోలిస్తే గూగుల్ సేవలు కాస్త చౌకగా కనిపిస్తాయి. లాభం తక్కువగా కనిపించినా, వినియోగదారుల సంఖ్య పెరిగేకొద్దీ అంతులేని ఆదాయం లభిస్తుందని సుందర్ పెట్టుకున్న విశ్వాసం నిజమైంది. ఇప్పుడు అంతర్జాలంలో లభించే సేవల్లో కనీసం అర్థభాగం సేవలు గూగుల్ నుంచే పొందుతున్నామంటే అందుకు సుందర్ తదితరుల అంతర్జాతీయ ఆర్థిక దృష్టే ప్రధాన కారణం.

ఇంకా అనేక అంశాలు సుందర్ పిచాయ్ విజయాలకు దోహదం చేస్తున్నాయి. పై 12 పాయింట్లూ వాటన్నిటి కలబోతతో రూపొందించినవి. ఈ లక్షణాలను మీలో మీరూ పెంపొందించుకోగలిగితే విజయం మీ వెన్నంటే వస్తుంది.

# భవిష్యత్తు కృత్రిమ మేధస్సుదే


**"కంప్యూటర్లు** ఇంకెంతోకాలం ఫిజికల్‌గా వుండబోవు. ఈ హార్డ్‌డిస్కులూ, మెమరీలూ, పవర్ బటన్లూ, కేబుల్సూ ఇంకెన్నో ఏళ్లు ఈ రూపంలో వుండకపోవచ్చు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాలు ఏడాది మారేకొద్దీ కొత్త సంచలనాలకు తెరలేపనున్నాయి. ఇందుకు కారణభూతమవుతున్న ఒకేఒక్క అంశం – ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్. కృత్రిమ మేధస్సు. ఎ.ఐ."

కొంతకాలం క్రితం ... తాను చదువుకున్న ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఇవ్వాళ్టి తరం విద్యార్థులతో మాట్లాడేందుకు వెళ్లిన సుందర్ ... రేపటి కాలానికి అనుగుణంగా తమను తాము మలచుకోవాల్సిన అవసరాన్ని వారికి వివరంగా చెప్పాడు. మనుషుల మెదళ్ల కంటే యంత్రాలే ఎక్కువ ప్రభావం చూపబోతున్నాయని, మనిషి మేధస్సును సవాల్ చేసే యంత్రాల మధ్య మన పనులు నిర్వహించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడబోతున్నాయని సుందర్ పేర్కొన్నాడు. గూగుల్ ప్రతినిధిగా ఎక్కడికి వెళ్లినా, ఇతర కార్యక్రమాలు, ఇంటర్‌వ్యూలలో కూడా తరచూ కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యత గురించి మాట్లాడుతున్నాడు. మరోవైపు, తన (గూగుల్) పేరెంట్ కంపెనీ షేర్ హోల్డర్లకు ఒక లేఖ రాస్తూ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించాడు.

"రాబోయే కాలమంతా కంప్యూటర్లదే. మన దైనందిన వ్యవహారాల్లో ఇప్పటికంటే ఎక్కువగా కంప్యూటర్ల మీద ఆధారపడవలసివస్తుంది. కానీ కంప్యూటర్ల రూపం మాత్రం ఈరోజున్నట్లు వుండదు. స్మార్ట్‌ఫోన్ల నుంచే దేన్నయినా ఆపరేట్ చేసే వ్యవస్థలు ఏర్పడుతున్నాయి. మొబైల్ ఫోన్ల నుంచి మనం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ దశలో అడుగుపెట్టబోతున్నాం. అప్పుడు మనం మనుషులకీ, యంత్రాలకీ మధ్య సయోధ్యను సాధించే పనిని మొదలుపెట్టాల్సివుంటుంది"

ఐదు నుంచి పదేళ్ల తర్వాత ప్రపంచం సాంకేతికంగా ఎలా వుండబోతోందో దార్శనికతతో అర్థం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా సుందర్ 'కృత్రిమ మేధస్సు'ను కీలకమైన అంశంగా భావిస్తున్నాడు. కృత్రిమ మేధస్సు సాయంతో మెషీన్ ఆధారంగా (మెషీన్ లెర్నింగ్) నేర్చుకోవడంపై కొన్ని సంవత్సరాలుగా గూగుల్ చాలా నమూనాల్లో పనిచేస్తోంది. ఈరోజు మనం ఉపయోగించుకుంటున్న గూగుల్ ఎర్త్, ట్రాన్స్‌లేటర్, గూగుల్ ఫొటోస్ వంటి చాలా యాప్స్, టూల్స్ కృత్రిమ మేధస్సు ఆధారంగా రూపుదిద్దుకున్నవే.

దాదాపు బిలియన్ డాలర్ల మూలధనంతో ఏర్పాటైన 'మ్యాజిక్ లీప్' అనే స్టార్టప్ ... ఆగ్యుమెంట్



రియాలిటీ సిస్టమ్ ఆధారంగా కదిలే 3డి చిత్రాల్ని తయారుచేయడం, సమీప ప్రదేశాల్లో వున్నవారితో సమాచారాన్ని పంచుకునే సాంకేతికతల్ని రూపొందించే పనిలో వుంది. గూగుల్ ఈ స్టార్టప్‌లో పెట్టుబడి పెట్టింది. బోర్డులో సుందర్ పిచాయ్ కూడా ఒక కీలక భాగస్వామి.

ఇంటర్‌నెట్ శోధన విషయాల్లో కూడా ఎ.ఐ కీలకం కానుందని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడం తప్పనిసరని సుందర్ ... గూగుల్ సహవ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్జీబ్రిన్‌లతో తరచూ వ్యాఖ్యానిస్తుంటారు. కృత్రిమ మేథస్సును ఉపయోగించుకోవడంలో గూగుల్‌ను తొలి పనిముట్టుగా మార్చడానికి సుందర్ తన వంతు కృషిచేస్తున్నాడు. ఈ కృషి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది కొత్త ఉద్యోగాలను సాధించేందుకు ఉపయోగపడుతుందని, భారతీయులకూ ఇది మంచి అవకాశమని సుందర్ చెప్తున్నాడు. ఇప్పటికిప్పుడు వాటి పరిధిని అంచనా వేయలేకపోవచ్చు కానీ, గూగుల్ భవిష్యత్తులో రూపొందించబోతున్న వందలాది ఫీచర్లు, టూల్స్ కృత్రిమ మేథస్సు ఆధారం గానే పనిచేయబోతున్నాయి.

యంత్రాలు మానవ మేథస్సును శాసించే కీలక దశకు చేరుకోబోతున్న సమయంలో కొత్తతరం యువతీ యువకులు తమ కెరియర్లను రూపొందించుకునే విషయంలో ఇంకా జాగ్రత్తగా వ్యవహరించాల్సివుంటుంది. సుందర్ పిచాయ్ వంటి సాంకేతిక నిపుణులు కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడంతోపాటు సరికొత్త అవకాశాల్ని సృష్టించడంలో కూడా ముందుంటారు. ఎటొచ్చీ మనం చేయాల్సిందల్లా వాటిని జాగ్రత్తగా ఉపయోగించుకునే కృషి చేయడమే. **బీ రెడీ ఫర్ దట్.**

## మేథస్సు కృత్రిమమే; ప్రయోజనాలు సహజమైనవి: సుందర్ పిచాయ్

# మీలో లీడర్‌ని నిద్ర లేపే 3 లక్షణాలు

**మానవజాతి** వికాసానికి ఉపయోగపడే సాంకేతిక ఉత్పత్తులను వారికి అందుబాటు లోకి తీసుకు రావడానికి, రేపటి తరంతో అందరినీ అనుసంధానం చేయడానికీ సుందర్ పిచాయ్ లాంటి లీడర్లు ప్రతి తరం లోనూ పుడుతూవుంటారు. ఇరవై ఏళ్లకు పైగా తన కెరియర్‌లో సుందర్ అనేక ఫీచర్లు, ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చాడు. సుందర్ కెరియర్‌ను చాలామంది '**గూగుల్‌కి ముందు, గూగుల్‌కి తరువాత**' అనే రెండు రూపాల్లో చూస్తారు. కానీ, నిజానికి సుందర్ ఎక్కడ పని చేసినా, వినియోగదారులకు విస్తృతంగా ఉపయోగపడే ఉత్పత్తుల రూపకల్పన కోసమే కృషిచేశాడు.

జీవితంలో ఉన్నతస్థితికి చేరాలని ఆశించేవారు సుందర్ పిచాయ్ జీవితం నుంచి నేర్చుకోవాల్సిన 3 ముఖ్యమైన అంశాలను ఈ వ్యాసంలో చదవండి.

## 1) మూలాల్ని మరిచిపోకపోవడం

ఎక్కడ మొదలుపెట్టాం, ఎలా ఎదిగాం, ఎక్కడికి చేరాం – వీటన్నిటినీ సర్వదా జ్ఞాపకం వుంచుకునే వ్యక్తులు జీవితంలో ఖచ్చితంగా ఉన్నత స్థానాలకు చేరతారు. ప్రముఖులైనవారు ఎవరి జీవితాన్ని తరచిచూసినా మీకీ లక్షణం తారసపడుతుంది. సుందర్ పిచాయ్ కూడా ఇదే కోవకి చెందుతాడు. బాల్యం, మద్రాసు (చెన్నయ్) జీవితం, కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రులు, టీచర్లు, స్నేహితుల సహకారం ... ఇవేవీ సుందర్ మర్చిపోలేదు. ఎన్ని ఆర్థిక సమస్యలున్నా పిల్లల చదువులను జాగ్రత్తగా తీర్చిదిద్దుకున్న తన తల్లిదండ్రుల ముందు సుందర్ ఇవ్వాళ్టికీ ఒద్దికగానే నడుచుకుంటాడు. తన అభివృద్ధికి నిచ్చెనలు వేసిన తల్లిదండ్రుల విశ్రాంత జీవితం సంతోషంగా గడవడం కోసం చెన్నయ్‌లో ఒక అందమైన ఇల్లు నిర్మించి ఇచ్చాడు. స్కూల్‌మెట్లు, యూనివర్సిటీ మేట్లతో మొదలు .. తాను పనిచేసిన ప్రతిచోటా తనతో పనిచేసిన కొలీగ్స్‌నీ మర్చిపోలేదతను. వారిలో చాలామంది ఇవ్వాళ్టికీ ఆయా సందర్భాల్లో సుందర్ నుంచి శుభాకాంక్షల సందేశాలు అందుకుంటూనే వుంటారు. 'తమ మూలాల్ని మర్చిపోకుండా జీవించేవారు శాశ్వతంగా జీవించివుంటారు' అనే సూక్తి సుందర్ పిచాయ్ విషయంలో నూరుశాతం రుజువవుతోంది.

## 2) ఇతరుల విజయాల మీద దృష్టి పెట్టండి

మీరు సాధించిన విజయం ఆల్‌రెడీ సాధించేసింది. దానిని సాధించడానికి కావాల్సిన నైపుణ్యాలు ఇప్పటికే మీదగ్గరున్నాయి. కాబట్టి ఇప్పుడు మీక్కావలసింది పాత విజయాల పునశ్చరణ కాదు; కొత్త





విజయాల ఆవిష్కరణ. వాటిని సాధించాలంటే ... మీ దృష్టి మీ విజయాల మీద కంటే, ఇతరుల విజయాల మీదే ఎక్కువగా వుండాలి.

ఉద్యోగం అంటేనే నలుగురితో కలిసి చేసేది, నలుగురినీ కలుపుకుపోతూ చేసేది. కాబట్టి అక్కడ మీ ఒక్కరి విజయం అంటూ వుండదు; కేవలం సమిష్టి విజయమే వుంటుంది. వారి గెలుపుల్లో మీ పాత్ర పెరిగితేనే మీరు సక్సెస్ అయినట్లు. ఇతరులు సాధించే విజయాల నుంచి మీరు నేర్చుకునే పాఠాలే మీ కొత్త విజయాలకు సోపానాలవుతాయి. మీతో కలిసిపనిచేసేవారికి ఎదురయ్యే అడ్డంకుల్ని తొలగించడంలో మీరు ముందుండండి, సమిష్టి విజయంలో మీ వాటా మీకెలాగూ దక్కుతుంది.

ఈ సూత్రాన్ని తుచ తప్పక పాటించడంలో సుందర్ ఎప్పుడూ ముందుంటాడు. 20 ఏళ్ల కెరియర్‌లో అతనితో కలిసి పనిచేసినవారందరూ ముక్తకంఠంతో చెప్పే మాట ఇది. ఈ కారణం గానే సుందర్‌తో కనీసం ఒక చిన్న ప్రాజెక్టులోనైనా కలిసి పనిచేయాలని కోరుకునేవారు కోకొల్లలుగా వుంటారు.

### 3) యువత బలపడేలా చేయడం

సుందర్ కొత్తతరం యువతీయువకులు, విద్యార్థులకు ఎనలేని ప్రాధాన్యమిస్తారు. ఎనిమిదో తరగతి లోనే ఐఐటీ ఫౌండేషన్ పరీక్షకు సిద్ధం కావల్సివస్తున్న ఇవ్వాళ్టి పిల్లల మీద ఎంత ఒత్తిడి వుంటుందో సుందర్ తరచూ ప్రస్తావిస్తుంటాడు. సుందర్ స్కూలురోజుల్నుంచీ బ్రిలియంట్ స్టూడెంటే. కానీ ఎప్పుడూ క్లాస్ ఫస్ట్‌లో నిలిచే విద్యార్థి కాదు. జాగ్రఫీ, చరిత్ర ఎప్పుడూ అతనికి కొరుకుడుపడేవి కాదు; పైగా క్లాసులో తొలి స్థానంలోకి రావడానికి అడ్డం పడుతుండేవి కూడా! కానీ, తాను ఈరోజున్న స్థానానికి చేరడానికి అవేవీ అడ్డంకులు కాలేదంటూ సుందర్ విద్యార్థుల్ని ప్రోత్సహిస్తుంటాడు.

"చదువు మీద సరైన ఫోకస్ పెట్టడమే అసలైన బలం. సృజనాత్మకతతో ఆలోచించడం, మరిన్ని రిస్కులు తీసుకోవడానికి సిద్ధపడితే సక్సెస్ అసాధ్యమైనదేమీ కాదు" అంటాడు సుందర్. ఇందుకు అతనో చిన్న ఉదాహరణ చెప్తాడు.

'గూగుల్ వార్షిక కోడింగ్ కాంపిటీషన్' కోసం ఓ 17 ఏళ్ల న్యూజిలాండ్ కుర్రాడు సిద్ధమయ్యాడు. ఆన్‌లైన్‌లో దొరికే సమాచారం, సమాచార వనరుల్ని ఉపయోగించుకుంటూ రెండున్నర నెలలపాటు తీవ్రంగా కష్టపడ్డాడు. కానీ, పోటీకి తన ప్రాజెక్టును సమర్పించడానికి సరిగ్గా ఒక్కరోజు ముందు ... న్యూజిలాండ్‌లో టీచర్లు, లాయర్ల ఆందోళనల్ని అడ్డుకోవడానికి అక్కడి ప్రభుత్వం ఇంటర్‌నెట్‌ను నిరోధించింది. దాంతో ఆ కుర్రాడు తన ప్రాజెక్టును గూగుల్‌కి సమర్పించలేకపోయాడు. అనంతరం కామెరూన్ లోని యాండీ యూనివర్సిటీలో చేరి గూగుల్‌తో కనెక్టయ్యే ప్రయత్నం చేశాడు. అతని విషయం తెలుసుకున్న సుందర్ ఒక ట్వీట్ చేస్తూ ... గూగుల్ ఫ్లెక్స్ టీమ్‌తో కలిసి పనిచేయడానికి నేరుగా ఆహ్వానించాడు. ఇప్పుడతను సుందర్‌తో కలిసి పనిచేస్తున్నాడు.

సుందర్ అసాధారణ విజయాలకు కారణభూతమైన సాధారణ లక్షణాల్లో పై మూడూ కూడా వున్నాయి. ఈ పుస్తకం వెనుక పేజీల్లో మరికొన్ని లక్షణాల్ని మీరు చదివారు; మరికొన్నిటిని ముందు పేజీల్లో చదవబోతున్నారు. నడవండి మరి!

# గూగుల్‌లో అత్యున్నత స్థానానికి ఎదగడానికి సుందర్‌కి ఉపయోగపడ్డ నాలుగు అంశాలు

సుందర్ పిచాయ్‌కి ప్రోగ్రామింగ్ మీద ఓకే అనిపించే స్కిల్సే వున్నాయితప్ప అతనంత గొప్ప ప్రోగ్రామర్ కాదు. కానీ ప్రాడక్ట్ డెవలప్‌మెంట్‌లో అతని స్కిల్స్ అసామాన్యమైనవి. కాబట్టే గూగుల్ సుందర్‌ను అక్కున చేర్చుకుంది. గూగుల్‌లో ఉద్యోగం సాధించడానికి, అక్కడ అత్యున్నత స్థానాలకు ఎదగడానికీ సుందర్‌కి ఉపయోగపడిన నాలుగు ప్రధానమైన లక్షణాలివీ!

**1) రాజకీయాల్ని ఊహించే శక్తి:** రాజకీయాలు, ఈగోలు మనిషిని ఏ స్థాయికి దించేస్తాయో సుందర్‌కి స్పష్టంగా తెలుసు. తాను మొదట పనిచేసిన కంపెనీలో ఎదురైన కొన్ని అనుభవాల్ని దృష్టిలో పెట్టుకుని, ఎక్కడా వాటి నీడలు తన మీద పడకుండా జాగ్రత్తపడ్డాడు. రాజకీయాలకు, చెప్పుడు మాటలకూ పూర్తిగా దూరంగా వుంటాడు. ఫలితంగా అటు కంపెనీలో, ఇటు బయటా ఎలాంటి వివాదాలకీ కేంద్రం కాకుండా తనను తాను రక్షించుకోగలుగుతున్నాడు సుందర్.

**2) పరిష్కారాల నావికుడు:** గూగుల్ ప్రాజెక్టుల్లో ఎదురయ్యే అనేక అంశాలకు సుందరే పరిష్కర్త. ఏ సమస్య ఎదురైనా అందరి కళ్లూ ముందు సుందర్‌నే చూస్తాయి. కానీ అతను మాత్రం తన కొలీగ్స్ నుంచి పరిష్కారాల్ని వినడానికే ఆసక్తి చూపిస్తుంటాడు. తాను బాస్‌ని, తన మాట నెగ్గించుకోగల అవకాశం వుండికూడా, సుందర్ ఆ ప్రయత్నాన్ని సుందర్ ఎప్పుడూ చేయలేదు. ఏ సమావేశంలోనైనా కూల్‌గా వెనక్కి జారగిలబడి కూర్చుని, అందరినీ తమ అభిప్రాయాలు, సూచనలు చెప్పనిచ్చిన తరువాతే సుందర్ అందరికీ ఆచరణయోగ్యమైన తన మార్గాన్ని వివరిస్తుంటాడు. అవసరమైనప్పుడు తన అభిప్రాయాల్ని అప్‌డేట్ చేసుకోవడానికీ సుందర్ మొహమాటపడడు.

**3) నిజమైన నాయకత్వ లక్షణాలు:** వర్క్‌ప్లేస్‌లో కాస్త అటూఇటూగా వ్యవహరించేవారు, నిరుత్సాహ పడే ఉద్యోగులను సుందర్ పిచాయ్ టీమ్‌లో చేరడానికి పంపిస్తుంటారని గూగుల్‌లో ఒక ప్రచారం వుంది. ఎందుకంటే – ఎంతటి నిరాశావాదినైనా ఆశావాదిగా మార్చే శక్తి సుందర్‌కి వుందనే విశ్వాసం. ఏ విజయానికైనా టీమ్‌వర్క్ ఒక్కటే మూలమని సంపూర్ణంగా నమ్మే సుందర్ తన ప్రాజెక్టుల్లో అందరికీ సమానమైన విలువ ఇవ్వడం, అందరినీ ఒకే దృష్టితో చూడడం చేస్తుంటాడు. ఫలితంగా బృందంలో అందరూ తమ బాధ్యతలను మరింత జాగ్రత్తగా పూర్తిచేస్తుంటారు.

**4) గొప్ప అనుసంధానకర్త:** సుందర్ ఏ విషయం మీదైనా అలవోకగా స్పందించగలడు. అదే సమయంలో మరికొందరి స్పందనల్ని, అభిప్రాయాల్ని కలపగలడు కూడా. ఉద్యోగుల మధ్య, ఆయా బృందాల మధ్య ఎదురయ్యే పలు తరహాల ఇబ్బందుల్ని నివారించడానికి సుందర్ కనెక్టివిటీ అద్భుతంగా పనిచేస్తుందంటారు. ఒక చిన్న ఉద్యోగి నుంచి టాప్‌ర్యాంక్ ఉద్యోగి దాకా ఎవరితోనైనా మాట్లాడడానికి, వారిమధ్య సయోధ్య కుదర్చడానికీ సుందర్ ఏమాత్రం మొహమాటపడరని అతని సహోద్యోగులు అనేక సందర్భాల్లో వెల్లడించారు. గూగుల్ సహవ్యవస్థాపకుడు లారీపేజ్ కూడా అనేక సందర్భాల్లో తన లక్ష్యాల్ని వివరించడానికి సుందర్‌నే ఉపయోగించుకుంటుంటారు.

# భారతీయ యువతకు గూగుల్‌లో గొప్ప అవకాశాలు

**గూగుల్** రథసారథిగా ఎంపికయ్యాక ఇండియా వచ్చిన ప్రతిసారీ సుందర్ పిచాయ్ ఇక్కడి యువ సాంకేతిక నిపుణులను ఉద్దేశించి ఎక్కడో ఒకచోట మాట్లాడుతూనేవున్నాడు. ముఖ్యంగా యూనివర్సిటీలు, పెద్దపెద్ద విద్యాసంస్థలకు వెళ్లడం, అక్కడినుంచి కొత్తతరం మానవ వనరుల్ని సాధించుకోవడానికి వున్న అవకాశాల్ని వినియోగించుకుంటున్నాడు. కొన్ని సందర్భాల్లో సిలికాన్ వ్యాలీ వేదికగా కూడా భారతీయ నిపుణుల గురించి ప్రస్తావిస్తున్నాడు. సుందర్ ఈ తరహా కార్యకలాపాల ద్వారా గూగుల్‌తో పాటు ఆల్ఫాబెట్ పేరెంట్ కంపెనీ కింద వున్న పలు కంపెనీల్లో భారతీయ యువనిపుణులకు కొన్ని అవకాశాలు దక్కాయి కూడా.

ప్రపంచమంతా భారత్ నుంచి వస్తున్న నిపుణులను ఆహ్వానిస్తోందంటూ సిలికాన్ వ్యాలీని పెద్ద ఉదాహరణగా చూపుతారు సుందర్ పిచాయ్. ఇండియాలో గూగుల్ వ్యాపారాల్ని బాగా విస్తరించే ప్రయత్నంలో వున్న సుందర్ తనకు ఇక్కడి నిపుణులే కావాలని మళ్లీమళ్లీ పేర్కొంటున్నాడు. రాబోయే మూడు నాలుగేళ్లలో దేశంలోని 30 ప్రధాన విశ్వవిద్యాలయాల నుంచి మంచి నైపుణ్యాలున్నవారిని శోధించడం, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌తో కలిసి వారికి అవసరమైన శిక్షణ ఇప్పించడం ద్వారా గూగుల్ ప్రాజెక్టుల్లో వారికి భాగస్వామ్యం కల్పించేందుకు సుందర్ ప్రయత్నిస్తున్నాడు.

మరోవైపు గూగుల్ తన ప్రాడక్టుల్లో కొన్నిటిని ఇండియాలో ప్రవేశపెట్టిన తరువాతే ఇతర దేశాల్లో లాంచ్ చేస్తోంది. ఉదాహరణకు స్థానిక భాషల్లో గూగుల్ సేవల్ని వినియోగించుకునే లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్టును 'గూగుల్ ఇండిక్ కీబోర్డ్' పేరుతో ముందు ఇండియాలోనే ప్రారంభించింది. ఆతరువాతే ఇతర దేశాలకు విస్తరించింది. యూట్యూబ్ ఆఫ్‌లైన్ ప్రాజెక్టు కూడా ముందు ఇండియాలోనే ప్రారంభమై, ఆతర్వాతే 77 దేశాలకు విస్తరించింది.

గూగుల్‌లో నేరుగానే కాక, పరోక్షంగా అంతకు వందరెట్ల ఉపాధి అవకాశాలను కల్పించే కృషి కూడా జరుగుతోంది. యూట్యూబ్ ఆఫ్‌లైన్ ప్రాజెక్టు ద్వారా  లక్షలాదిమంది ఔత్సాహికులు గూగుల్

Google PROJECT LOON

ఉద్యోగులు కాకుండానే గూగుల్ సేవల ద్వారా ఆదాయం సంపాదించుకునే అవకాశం లభించింది. మారుమూల ప్రాంతాలకు సైతం వేగవంతమైన ఇంటర్‌నెట్‌ను అందించే 'ప్రాజెక్ట్ లూన్'ను గూగుల్ ఇప్పటికే ఇండియాలో ప్రారంభించింది. భారతీయ రైల్వే శాఖతో కలిసి దేశవ్యాప్తంగా ప్రధానమైన స్టేషన్లలో ఉచిత వైఫై సదుపాయాన్ని అందిస్తోంది. దేశంలోని అన్ని ముఖ్యమైన స్టేషన్లకీ ఈ సేవల్ని విస్తరించడం ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఒక బలమైన పురోగతికి గూగుల్ పునాది వేస్తోంది. విద్యార్థులు, రైతులు, అన్ని తరహాల ప్రజలు మార్కెట్‌తో అనుసంధానం కావడానికి ప్రాజెక్ట్ లూన్ చాలా కీలకం కాబోతోంది. మరోవైపు మెషీన్ ఆటోమేషన్ ద్వారా కృత్రిమ మేధస్సు కోణం నుంచి కూడా అనేక అవకాశాలు భారతీయులకు లభించనున్నాయి. వీటన్నిటినీ అందుకోవడానికి కావల్సిన విధంగా భారతీయ యువనిపుణులే సిద్ధం కావాల్సివుంది.

స్మార్ట్ ఫోన్ల ద్వారా సరికొత్త సాంకేతిక విప్లవాలను సాధించేందుకు సుందర్ బృందం తీవ్రంగా శ్రమిస్తోంది. ఇంటర్‌నెట్ లేని చోట్ల, లేదా తక్కువగా వుండే చోట్ల కూడా ఉపయోగపడేలా ఆఫ్‌లైన్ టెక్నాలజీలను రూపొందిస్తోంది. 'గూగుల్ బుక్స్' పేరుతో ప్రారంభించిన ఫీచర్ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది పుస్తకాలను ఒక్కచోటికి చేరుస్తోంది. గూగుల్ బుక్స్‌తో పాటు అనేక ఫీచర్లను ఆఫ్‌లైన్ టెక్నాలజీల ద్వారా మరింత పరిపుష్టం చేసేందుకు సుందర్ బృందం శ్రమిస్తోంది.

ఏకొద్దిమందికో ఉపయోగపడే ప్రాజెక్టుల మీద గూగుల్‌కి, వ్యక్తిగతంగా తనకీ ఆసక్తి లేదని, కనీసం కోటిమంది ప్రజలకైనా ఉపయోగపడే ప్రాజెక్టులను మాత్రమే తాము దృష్టిలో పెట్టుకుంటామని సుందర్ ఓ ఇంటర్‌వ్యూలో చెప్పాడు. గూగుల్ ప్రధానంగా ... ఆయా అవసరాలకు తగిన టూల్స్ రూపొందించడం, సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు సాధించడం కోసం కృషిచేస్తోందని, ఈ కారణంగానే తమకు అపారమైన అవకాశాలు లభిస్తున్నాయని వివరించాడు.

"గూగుల్‌లో మేమెప్పుడూ చాలా ముందరి ప్రపంచాన్ని ఊహిస్తాం. మా అన్ని ప్రాజెక్టులకీ ఎందుకు భారతీయ నిపుణులనే కీలకంగా భావిస్తామంటే ... ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత భాగస్వామ్యం అత్యంత కీలకం. ఇండియా రేపటి ప్రపంచ భవిష్యత్తును నిర్దేశించే దేశంగా మారుతోంది. ఇందువల్లే మేము మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీల్ని పెంచుతున్నాం. చాలా దేశాలతో పోలిస్తే ఇండియాలో దెవలపర్లు బాగా దొరుకుతారు. కాబట్టే సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి ఇండియానే తొలి ప్రాధాన్య దేశంగా నిలబడుతోంది" అని చెప్పాడు సుందర్. మహిళా ఔత్సాహికులకు ఎక్కువ అవకాశాలు కల్పించడం ద్వారా భారత్ పురోగతిలో గూగుల్ కీలకపాత్ర పోషించనుందని కూడా చెప్పాడు సుందర్.

అవకాశాల్లేవని నిరాశపడే కోట్లాదిమంది భారతీయులు ... అవకాశాల్ని అందిస్తున్న గూగుల్‌ను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నించాలి. ప్రత్యక్ష ఉపాధి అవకాశాల కోసం మీకు అనేక కీలక నైపుణ్యాలు అవసరం కావచ్చు; కానీ, పరోక్ష అవకాశాల కోసం అంత మేధస్సు అవసరం లేదు. ఇక సంపాదనంటారా? వారికీ, మీకూ పెద్దగా తేడా వుండకపోవచ్చు.

# సవాళ్లు ఎదురైనప్పుడల్లా సుందర్ ...

**సవాళ్లు** లేని ఉద్యోగం, వ్యాపారం వుండనేవుండవు. కొన్నిటిని సులువుగా పరిష్కరించుకోగలిగితే, ఇంకొన్ని అసలు కొరుకునపడనివ్వకుండా వుంటాయి. కానీ అంతిమంగా ఒక పరిష్కారం కనుక్కో కుండా ఏ సవాలూ అంతం కాదు. సవాళ్లను ఎదుర్కోవడంలో ఒక్కొక్కరికీ ఒక్కొక్క శైలి వుంటుంది. కొందరు ఎంత పెద్ద సవాళ్లనైనా తక్కువ శ్రమతో సులభంగా పరిష్కరించేస్తారు. సుందర్ పిచాయ్ కూడా ఇటువంటివారిలో ఒకడు.

చదరంగంలో వరల్డ్ ఛాంపియన్ గ్రాండ్‌మాస్టర్‌కి ఎంత మల్టీటాస్కింగ్ అవసరమో అంతకంటే ఎక్కువ మల్టీటాస్కింగ్ పనిని సుందర్ చేయాల్సివుంటుంది. ఒక్కోసారి ఒకేరోజు గంటల తరబడి వేర్వేరు అంశాలపై వేర్వేరు సమావేశాల్లో పాల్గొనాల్సివస్తుంటుంది. ఒకచోట ఆలోచించింది రెండో చోట పనికిరాదు; ఒకచోట చెప్పింది మరోచోటికి ఉపయోగపడదు. ఇలాంటి ఒత్తిళ్ల మధ్య కూడా సుందర్ ... సవాళ్లను ఎదుర్కోవడంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నాడు.

కేలిఫోర్నియా, మౌంటెన్ వ్యూ లోని గూగుల్‌ప్లెక్స్ ఆఫీసులోని సుందర్ పిచాయ్ గదిలో ఓ వైపు ఒక సోఫా, రెండు కుర్చీలు, కలపతో తయారుచేసిన ఒక చిన్న డైనోసార్ బొమ్మ, గూగుల్ క్రోమ్ కోసం అనుకున్న మస్కట్, ఓ కాఫీ టేబుల్ కనిపిస్తాయి. మరోవైపు ఓ పెద్ద ట్రెడ్‌మిల్ డెస్క్ కనిపిస్తుంది. ఒత్తిళ్ల నుంచి బయటపడడానికి సుందర్ ఆ ట్రెడ్‌మిల్‌ను ఉపయోగిస్తుంటారని చాలామంది భావిస్తారు. కానీ సుందర్ ఎప్పుడో కానీ దానిని ముట్టుకోడు. 'ట్రెడ్‌మిల్ మీద నడవడం, ఈమెయిల్స్ చెక్ చేసుకోవడం రెండూ ఏకకాలంలో చేసే పనులు కావు. నాకు మల్టీటాస్కింగ్ చేతకాదు' అంటాడతను నవ్వుతూ.

ప్రపంచపు రెండో అతిపెద్ద కంపెనీ గూగుల్ అధినేతగా ... కంపెనీ విశ్వవ్యాప్త కార్యక్రమాలను చాలా నిశితంగా పరిశీలిస్తూవుండడం, చిన్న ఇబ్బంది కూడా తలెత్తకుండా జాగ్రత్తగా వుండడం సుందర్ బాధ్యతల్లో కీలకమైనవి. రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ఎదురయ్యే ఇబ్బందులనూ అధిగమించుకుంటూ ముందుకు వెళ్లాల్సివుంటుంది.

లారీపేజ్ వారసుడుగా సుందర్ తెరమీదికి వచ్చిన సమయానికి ప్రెసిడెంట్ ఇమ్మిగ్రేషన్ పాలసీ, యూట్యూబ్ వీడియోలపై ప్రకటనదారుల నుంచి వ్యక్తమవుతున్న ఆగ్రహావేశాలు, పెద్దమొత్తంలో రెగ్యులేటరీ జరిమానాలు, లింగ సమానత్వం, గూగుల్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు మరీ

శక్తివంతులుగా మారిపోవడంతో ఎవరినీ లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారని వాటాదారుల అభిశంసనలు ... ఇలాంటి అనేక తలనొప్పులు అమాంతం సుందర్ మీద పడ్డాయి.

మరోవైపు గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లు ఎన్నికల సమయంలో అవాస్తవ సమాచారాల్ని ప్రచారం చేశాయని అమెరికా దర్యాప్తు సంస్థలు ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టాయంటూ ఒక పుకారువార్త కూడా ప్రచారమైంది. ఇంతటి క్లిష్టసమయాల్లో గూగుల్ భారాన్ని చేతుల్లోకి తీసుకున్న సుందర్ పిచాయ్‌ని ఉద్దేశించి డేవ్ గిరార్డ్ అనే గూగుల్ మాజీ ఉద్యోగి ఒక మంచి మాటన్నాడు ఇలా. **'సరైన సమయానికి సరైన మనిషిని తీసుకొచ్చారు'.**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏడు ముస్లిం దేశాల నుంచి వచ్చేవారికి వీసాలను నిరాకరించడం పై కొందరు గూగుల్ ఉద్యోగులు కంపెనీ అనుమతితో ఒక నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గూగుల్ ర్యాంకు, స్టేటస్‌లకు సంబంధించి అమెరికా ఎన్నికల సమయం నుంచీ అణిగిమణిగివున్న విషయాలు కూడా ఈ నిరసన కార్యక్రమంలో బయటపడ్డాయి. తక్షణం రంగం లోకి దిగిన సుందర్ పిచాయ్ అక్కడి వాతావరణాన్ని చల్లబరచడానికి ... అమెరికాకి వలస వచ్చిన ఒక విదేశీయుడిగా తన అనుభవాలు, అభిప్రాయాల్ని కూడా ఉద్యోగులతో పంచుకున్నాడు. 'మన గొంతులు దేశవ్యాప్తంగా ప్రజల వద్దకు బలంగా చేరాలి' అని అతను చెప్పిన చివరి వాక్యం తర్వాత అక్కడ కరతాళధ్వనులు మారుమోగాయి.

అమెరికా ఎన్నికల సమయంలో ఆల్ఫాబెట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎరిక్ ... హిల్లరీ క్లింటన్‌కి మద్దతు పలికారనే వార్తలు అమెరికాలో వ్యాపించాయి. కానీ సుందర్ మీద మాత్రం ఎప్పుడూ ఇటువంటి రాజకీయపు వార్తలేవీ రాలేదు. పిచాయ్ తన రాజకీయ అభిప్రాయాల్ని తనలోనే దాచుకున్నాడు తప్ప ఏనాడూ బయటపెట్టలేదు. వాటిపై తాను ఒక్క మాట మాట్లాడినా, ఆ ప్రభావం గూగుల్‌లో పనిచేసే 70 వేల మంది ఉద్యోగుల మీద పడుతుందని అతనికి తెలుసు. అందుకే సుందర్ మౌనాన్నే తన భాషగా తీసుకున్నాడు. 'కంపెనీ నొప్పిని నా నొప్పిగా భావిస్తాను. లేదంటే ఏం జరిగినా అది నావల్లే అయినట్లవుతుంది' అంటాడు సుందర్.

ఇలా ఎన్నో సమయాల్లో ఎన్నో ఒత్తిళ్లు ఎదురవుతున్నా సుందర్ మాత్రం నిశ్చలంగా వాటిని ఎదుర్కొంటూ ముందుకు వెళ్తున్నాడు. యూట్యూబ్ ప్రకటనదారులకు అందాల్సిన ఆదాయం వంటి విషయాలపై యూరోపియన్ యూనియన్ గూగుల్‌కి 79 బిలియన్ డాలర్ల జరిమానా విధించిన సమయంలో కూడా సుందర్ నింపాదిగానే వున్నాడు. "కూర్చుని మాట్లాడుకుంటే ఎంత పెద్ద సమస్యయినా ఇట్టే పరిష్కారమైపోతుంది. యూరోపియన్ యూనియన్‌తో ఆ దిశగా ప్రయత్నిస్తా" అంటూ తన స్థయిర్యాన్ని ప్రదర్శించాడు.

కుటుంబంతో గడపడానికి ఎప్పుడో కానీ సమయం చిక్కని సుందర్ ... కొంతకాలం క్రితం కుటుంబసభ్యులతో కలిసి పోర్చుగల్ వెళ్లాడు. పోర్చుగల్‌లో దిగి, రెండు రోజులు కాస్త రిలాక్స్ అయ్యాడో లేదో, డామోర్ అనే గూగుల్ ఉద్యోగి తన సహోద్యోగులకు పంపిన ఇంటర్నల్


ఈమెయిల్స్, వాటిపై సహోద్యోగుల విభేదింపులు, కామెంట్లతో గందరగోళం మొదలైంది. ఒకట్రెండు రోజుల్లోనే ఆ ఈమెయిల్స్ అన్నీ పబ్లిక్ అయిపోయాయి. కంపెనీ మీద అనుమానాల నివృత్తి కోసం ఉధృతి మొదలైంది. దీంతో తక్షణం సర్దుకుని పోర్చుగల్ నుంచి అమెరికా చేరిపోయాడు సుందర్. వెంటనే నష్టనివారణ చర్యలు మొదలుపెట్టాడు. ఆల్ఫాబెట్ బోర్డులో సభ్యుడు, గూగుల్ ఎగ్జిక్యూటివ్ లలో పలువురికి మెంటర్‌గా వ్యవహరిస్తున్న జాన్ హెన్నెసీని కలిశాడు. తన ఆలోచనను, హెన్నెసీ సూచనలను అనుసంధానం చేసుకున్నాడు. ఆమర్నాడే డామోర్‌ను తక్షణం ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశాడు. “తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా వెల్లడించే హక్కు అందరికీ వుంటుంది. కానీ, డామోర్ లేఖలో గూగుల్‌లో పనిచేసే స్త్రీ, పురుష ఉద్యోగుల మధ్య వివాదాల్ని రేకెత్తించే అంశాలున్నాయి. గూగుల్ వర్క్‌ప్లేస్‌ను, నా ఉద్యోగులను దృష్టిలో పెట్టుకుని నేనీ కఠిన నిర్ణయం తీసుకున్నాను’ అని ప్రకటన కూడా జారీచేశాడు.

ఆతర్వాత అమెరికన్ మీడియా, కొన్ని ప్రత్యామ్నాయ సామాజిక సంస్థలు డామోర్‌ను టెక్నాలజీ కంపెనీలకు దడ పుట్టించిన వీరుడంటూ ఆకాశానికి లేపాయి. కొన్ని రోజుల పాటు చర్చలు నడిపాయి. కానీ సుందర్ మాత్రం కంపెనీ, ఉద్యోగుల వైపే నిలబడ్డాడు. డామోర్ పేరును కూడా ఎక్కడా పలకలేదు. అసలేమీ జరగనట్టే వుండిపోయాడు. ఫలితంగా డామోర్ అగ్గి ఎంత వేగంగా రాజుకుందో అంతే వేగంగా చల్లారిపోయింది.

ఇలా ఎన్నో సమయాల్లో సుందర్ క్లిష్టమైన సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ, తన విభిన్నమైన పరిష్కారాలతో గూగుల్‌ను నిరంతరాయంగా శోభిల్లే గులాబీగా నిలబెట్టాడు.




ఐఐటీ ఖరగ్‌పూర్ లోని తన గదిలో సుందర్ పిచాయ్. పుట్టి పెరిగిన చెన్నై తరువాత సుందర్ చూసిన నగరం ఖరగ్‌పూరే. ఖరగ్‌పూర్ ఐఐటీ తనకు చాలా నేర్పిందని వినమ్రంగా చెప్తాడతను. ఇక్కడి ప్రొఫెసర్లు, తోటి విద్యార్థులు చాలా సౌహార్ద్రంగా వ్యవహరించారని, లైబ్రరీ తనకెంతో సాయం చేసిందంటాడు సుందర్. పునాది బలంగా వుంటేనే కదా ఎంతటి నిర్మాణమైనా నిలబడేది!




సుందర్ మద్రాసు స్కూల్లో ప్రైమరీ క్లాసు విద్యార్థిగా వున్నప్పటి స్కూల్ ఫొటో ఇది. పైవరుసలో ఎడమ నుంచి నాలుగో బుడతడే సుందర్. ఎప్పుడూ చదువే లోకంగా బతికే కుర్రాడని, తోటి పిల్లలతో ఆడుకోవడానికి గ్రౌండ్‌కి కూడా వెళ్లేవాడు కాదని సుందర్ మీద కంప్లయింట్ వుండేదట. గూగుల్ సీఈఓ అయ్యాక కొంచెం నలుగురిలోకీ వస్తున్నాడు కానీ, సుందర్ మహా సిగ్గరి.



"మీకో విషయం చెప్పాలనుకుంటున్నా. ఈ విషయం మీకు ఇంకెవరో చెప్పాల్సిన అవసరం లేదు; నేనే చెప్తున్నా. మీకోసం గూగుల్‌లో ఉద్యోగం సిద్ధంగా వుంది" 'టెక్నోవేషన్ ఛాలెంజ్' పోటీలో పాల్గొన్న యువ సాంకేతిక నిపుణులకు సుందర్ పిచాయ్ ఇచ్చిన భరోసా ఇటువంటివారెందరిలోనో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ పోటీలో భారతీయ యువనిపుణులూ పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



గ్రౌండ్ క్రికెట్: పాతికేళ్ల క్రితం తాను క్రికెట్ ఆడుకున్న మైదానంలో మళ్లీ క్రికెట్ ఆడి, తన మూలాల్ని గుర్తుచేసిన సుందర్ పిచాయ్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లినా, అక్కడి స్థానిక విషయాలు, క్రీడల గురించి తెలుసుకోవడం సుందర్ హాబీల్లో ఒకటి. కేవలం పేర్లే కాకుండా, అవి ఎలా ఆడతారో ఆడే వివరాలు కూడా తెలుసుకుంటారు. వాటిని బ్లాగుల ద్వారా అందరితో పంచుకోమనీ సూచిస్తుంటారు.





భారతీయం: 'డిజిటల్ ఇండియా' ప్రారంభోత్సవంలో భారత ప్రధాని నరేంద్ర మోడీతో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యా నాదెళ్ల. భారతీయ యువ నిపుణులకు గూగుల్ నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తామని, అందుకవసరమైన టూల్స్‌ను విస్తారంగా రూపొందిస్తామని సుందర్ ఈ సభలో పేర్కొన్నారు.




అణచివేత కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నిలబడలేకపోతున్న ఆఫ్రికన్, నైజీరియన్ నిపుణులకు గూగుల్ అండగా నిలుస్తుందని సుందర్ పిచాయ్ హామీ ఇచ్చారు. ఉద్యోగావకాశాల కల్పన, వ్యాపారావకాశాల్ని పెంచడం ద్వారా ఆర్థిక స్వావలంబనను సాధించడానికి అనువుగా నైజీరియాలో కొన్ని కార్యక్రమాలను చేపడతామని నైజీరియన్ మిత్రులకు సుందర్ మాటిచ్చారు.




ఎప్పుడూ అంతర్యుద్ధాలతో సతమతమయ్యే వియత్నాంలో టెక్నాలజీ వ్యాప్తి ద్వారా ఉపాధి అవకాశాలు పెంచే ప్రయత్నానికి గూగుల్ ప్రతినిధిగా సుందర్ శ్రీకారం చుట్టాడు. అందులో భాగంగా అనేకమంది వియత్నాం యువ సాంకేతిక నిపుణులతో సంప్రదింపులు జరిపాడు. వియత్నాంలో రోడ్డు పక్కన ఒక కాకా హెూటల్లో సుందర్ ఒక యువ టెక్నోక్రాట్‌ను కలుసుకున్నప్పటి చిత్రమిది.




మహిళలకు ఎక్కువ అవకాశాలు అందించగలిగితే పారిశ్రామిక అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని, కుటుంబ జీవనం సాఫీగా సాగిపోతుందని సుందర్ విశ్వాసం. 'ప్రాజెక్ట్ లూన్' ద్వారా భారతీయ మహిళలు లెక్కకు మించిన అవకాశాలు అందుకోగలుగుతారని, స్మార్ట్‌ఫోన్ ఒక్కటుంటే చాలు ... స్వావలంబన సాధించగలుగుతారని అనేక సందర్భాల్లో చెప్పాడతను.



ఒకరు భారతీయ సినిమా సూపర్‌స్టార్. మరొకరు ప్రపంచ టెక్నాలజీ సూపర్‌స్టార్. గూగుల్‌ప్లెక్స్ 'ఫైర్‌సైడ్ ఛాట్'లో వీళ్లిద్దరూ ఇలా కలిశారు. ఒక మెచ్యూర్డ్ జర్నలిస్టులా సుందర్ షారుఖ్‌ని 37 నిముషాల పాటు ఇంటర్వ్యూ చేశాడు. వీడియోను మీరు యూట్యూబ్‌లో ఈ లింక్ నుంచి చూడొచ్చు. https://goo.gl/a73UNQ




**30 డాలర్ల (రు.2000 లోపు) ధరకు స్మార్ట్ ఫోన్లను భారతీయులకు అందుబాటు లోకి తేవడంపై సుందర్ చేసిన ప్రస్తావన ఇండియన్ మార్కెట్ మీద మంచి ప్రభావాన్నే చూపింది. చిన్న, మధ్యతరగతి వ్యాపార అవసరాల కోసం పనికొచ్చే ఈ చౌక స్మార్ట్‌ఫోన్లకు తాము టెక్నాలజీ సాయం అందిస్తామని సుందర్ ఇచ్చిన హామీ మొబైల్‌ఫోన్ల కంపెనీల్లో ఆశలు చిగురింపజేసింది.**




సుందర్ పిచాయ్‌ని గూగుల్ సీఈఓ స్థానానికి చేర్చడానికి ఉపయోగపడిన అన్ని లక్షణాలనూ పై చిత్రం నుంచి తెలుసుకోవచ్చు. వీటన్నిటినీ మీలో మీరూ ప్రోది చేసుకోగలిగారా, మీరెక్కలేని ఎత్తులు, చేరలేని దూరాలు ఏవీ వుండవు. సుందర్ పిచాయ్ లాంటి యువనాయకులు ఇవ్వాల్టి భారత్‌కి లక్షల్లో కావాలి. వారిలో మీరూ ఒకరు కావాలని ఆశిస్తున్నాం. జయహో.

# విన్నపం

భారతీయ యువశిఖరం సుందర్ పిచాయ్ జీవితం నుంచి తీసుకున్న అనేక స్ఫూర్తిదాయక అంశాలతో, ఒక కొత్తతరం థీమ్‌తో రూపొందించిన ఈ చిన్న పుస్తకం మన దేశపు యువతీయువకులు, వ్యాపార ఔత్సాహికులు, మహిళలకు కీలకంగా ఉపయోగపడుతుంది. సామాజిక, రాజకీయ సంధాన వేదికగా పనిచేస్తున్న 'ఉదయం వేదిక' లాభాపేక్షరహితంగా ఈ ప్రచురణలను చేపట్టింది. స్వల్పధరల్లో లభించే ఉదయం పుస్తకాలన్నీ ఈ తరానికి మెరుగ్గా పనికొచ్చేలా, వారిలో నాయకత్వ లక్షణాల్ని పెంచడంతో పాటు ఎదిగే అవకాశాల్ని సూచించడానికీ ఉపకరిస్తాయి. 'ఉదయం' పుస్తకాలను వ్యక్తిగతంగానే కాక పాఠశాలలు, కళాశాలలు, గ్రంథాలయాలకు అందించే ప్రయత్నం చేస్తున్నాం. మా ప్రయత్నానికి మీ అండాదండా కావాలి. ఒక బ్రేక్‌ఫాస్ట్ ఖర్చుతో లభించే జ్ఞానసంపదను విస్తృతంగా అందరికీ చేర్చేందుకు 'ఉదయం వేదిక' మీ సహకారం కోరుతోంది.

**ధన్యవాదాలు.**



వెలిగే దీపం మరెన్నో దీపాల్ని వెలిగిస్తుంది



సుందర్ పిచాయ్ జీవితం కొత్తతరం విద్యార్థులు, నిపుణులకు ఒక మంచి సిలబస్. ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి ప్రపంచపు అత్యున్నత టెక్నాలజీ కంపెనీకి సీఈఓగా ఎదిగే దాకా సుందర్ పిచాయ్ జీవితం లోని అనేక కోణాలను తాకుతూ, కొన్ని స్ఫూర్తిదాయక ఘటనల్ని ఆధారంగా తీసుకుని ఈ విలువైన పుస్తకాన్ని 'ఉదయం వేదిక' విడుదల చేస్తోంది. సుందర్ పిచాయ్ గురించి తెలుగులో ఇదే తొలి పుస్తకం.

**సురేశ్ వెలుగూరి**

సుందర్ పిచాయ్ భారతీయ యువతకు ఏం సందేశమిస్తున్నాడు?
ఎటువంటి దారిలో నడిస్తే ఖచ్చితంగా విజయం సాధ్యమంటున్నాడు?
తన జీవితం నుంచి ఏయే అంశాలను ఉదాహరణగా ఇస్తున్నాడు?
ఇంకా అనేక అంశాల పొందికైన కూర్పు ఈ పుస్తకం.
ప్రతి ఇంటా, ప్రతి గ్రంథాలయంలో వుండదగ్గ పుస్తకం.



'ఉదయం వేదిక' ప్రచురణ

₹60

www.vmrgbooks.com